
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 258 | హైదరాబాద్ | బుధవారం 08-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00

11లో

టర్కీలో ఇజ్రాయెల్ కాన్సులేట్ వద్ద కాల్పుల కలకలం... ముగ్గురు సాయుధుల హతం

## డాష్ కామెంట్‌కు రాష్ కామెంట్ చేయబోను
# విజయన్‌కు రేవంత్ కౌంటర్

- కేరళ అసెంబ్లీ ఎన్నికలు
- కేరళ సీఎం విజయన్, తెలంగాణ రేవంత్ రెడ్డి మధ్య మాటల యుద్ధం
- తాజాగా విజయన్ లేఖకు బదులిచ్చిన రేవంత్ రెడ్డి
- పాత నీతి ఆయోగ్ లెక్కలతో తెలంగాణను అంచనా వేయొద్దని హితవు
- దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణదేనని స్పష్టం

11లో





బీఆర్ఎస్ 200 యూట్యూబ్ ఛానళ్లను
## కొనుగోలు చేసింది

- యూట్యూబ్ చానళ్లతో బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందన్న జూపల్లి
- బీఆర్ఎస్ ప్రచారాలను కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవాలని పిలుపు
- పార్టీ కోసం ప్రతి కార్యకర్త రోజుకు గంట సమయం కేటాయించాలన్న జూపల్లి


11లో

ఇరాన్‌లోని భారతీయులకు
## హై అలర్ట్..!

- ఈ రాత్రి ప్రపంచచరిత్రలో కీలక ఘట్టంలా నిలిచిపోతుందన్న ట్రంప్
- ఓ నాగరికత ముగిసిపోతుందని ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక
- ఇరాన్‌లోని భారత పౌరుల పరిస్థితి పట్ల అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం
- తదుపరి 48 గంటల పాటు ఇళ్లకే పరిమితం కావాలని సూచన
- సైనిక స్థావరాలు, విద్యుత్ కేంద్రాలకు దూరంగా ఉండాలని స్పష్టం

11లో





11లో

కమికాజే డ్రోన్లు సిద్ధం..
## శత్రువులకు ఇక గండమే!

- కమికాజే డ్రోన్లను తయారు చేసిన స్వదేశీ సంస్థ 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ'
- రెండు నెలల్లోనే సైన్యానికి డ్రోన్లను అందించిన వైనం
- గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించనున్న డ్రోన్లు

దేశం కోసం నేను, నా ప్రజలు
**ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు**

11లో

ట్రంప్ హెచ్చరిక
## ఇరాన్ అంతమైపోతుంది!

- ఇరాన్‌ను ఉద్దేశించి ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- ఒప్పందం కుదరకపోతే నాగరికత అంతమవుతుందని హెచ్చరిక
- ట్రూత్ సోషల్‌లో తీవ్రమైన పోస్ట్ చేసిన అమెరికా అధ్యక్షుడు
- పాలన మార్పుతో అద్భుతాలు జరగవచ్చని వ్యాఖ్య
- 47 ఏళ్ల దోపిడీ, అవినీతికి ఈ రాత్రితో ముగింపు అని పేర్కొన్న ట్రంప్

11లో



ఏపీ అగ్నిమాపక శాఖకు
# హైటెక్ హంగులు

- అగ్నిమాపక శాఖ ఆధునికీకరణకు ప్రభుత్వం శ్రీకారం
- రూ.33.25 కోట్ల విలువైన వాహనాలు, పరికరాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో పెరుగుతున్న హై-రైజ్ భవనాలకు అనుగుణంగా ఆధునికీకరణ జరగాలన్న సీఎం
- ప్రజల ప్రాణాలను కాపాడటమే తొలి ప్రాధాన్యమని అధికారులకు స్పష్టం
- మొత్తం రూ.252.93 కోట్లతో శాఖను బలోపేతం చేసేందుకు ప్రణాళిక

11లో





అరెస్టులు.. 11లో
## మాకు కొత్త కాదు

- పరిగి భూసేకరణ బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నేతల నిర్బంధం
- ప్రభుత్వ చర్యలను పిరికిపంద చర్యలుగా అభివర్ణించిన కేటీఆర్
- ఉద్యమ కాలం నుంచి ఇలాంటివి ఎన్నో చూశామని వ్యాఖ్య

ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు
## భారీ వర్ష సూచన

- మూడు రోజుల పాటు ఏపీ, తెలంగాణకు వర్ష సూచన
- ఏపీలో 9 జిల్లాలకు రెడ్ అలర్ట్
- తెలంగాణలో 5 జిల్లాలకు భారీ వర్షాల హెచ్చరిక

11లో



భారతశక్తి

# మేలిమి ప్రత్యామ్నాయం బయోగ్యాస్

ఎల్‌పీజీ కోసం ఇండియా ఎక్కువగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. అందులోనూ అధికశాతాన్ని హర్మూజ్ జలసంధి నుంచే తెప్పించుకుంటోంది. పశ్చిమాసియా యుద్ధం ఆ జలసంధిని కూడా రణరంగంగా మార్చేయడంతో ఎల్‌పీజీ సరఫరాలు సన్నగిల్లిపోయాయి. కీలక రంగాల్లో పరాధీనత ఎంతటి విపరిణామాలకు దారితీస్తుందో బోధపడటంతో ఎల్‌పీజీకి ప్రత్యామ్నాయాలను అందిపుచ్చుకోవడంపై దేశవ్యాప్తంగా చర్చలు సాగుతున్నాయి. వాస్తవానికి కట్టెల పొయ్యిలతో పర్యావరణానికీ, ప్రజారోగ్యానికీ జరుగుతున్న నష్టాన్ని గుర్తించిన ప్రభుత్వాలు బయోగ్యాస్ వినియోగాన్ని ప్రోత్సహించేందుకు 1980ల్లోనే ప్రత్యేక చర్యలు చేపట్టాయి. కానీ, కాలక్రమంలో సర్కారీ రాయితీలు, ఇతర కారణాలతో ప్రజలు ఎల్‌పీజీ వైపు మళ్లడంతో సేంద్రియ పదార్థాలతో గ్యాస్ తయారీ తగ్గిపోయింది. దాంతో ఎల్‌పీజీ కోసం ఇండియా ఏటా రూ.లక్ష కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చించాల్సి వస్తోంది. సంబంధిత రాయితీలకూ రూ.10వేల కోట్లకు పైగా ఖర్చవుతోంది. పైపెచ్చు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తలెత్తిన ప్రతిసారీ ఆ ప్రభావం మన వంటగదులపై పడుతోంది. ఆ ఆందోళనకర పరిస్థితులను నివారిస్తూ, స్వావలంబన పథంలో దూసుకుపోవాలంటే బయోగ్యాస్ ఉత్పత్తి పెంపుపై ప్రభుత్వాలు శ్రద్ధ వహించాలి.

దేశవ్యాప్తంగా సుమారు 20కోట్ల పశుసంపద ఉంది. వాటి పేడ విలువైన బయోగ్యాస్ వనరుగా ఉపయోగపడుతుంది. పంట వ్యర్థాలు, వృథాగా పడేసే ఆహార పదార్థాలతోనూ గ్యాస్‌ను తయారు చేసుకోవచ్చు. ఇందుకు అవసరమైన ప్లాంట్ల నిర్మాణానికి కేంద్రం సాయం చేస్తోంది కూడా! ఆ మేరకు బయోగ్యాస్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నవారు ఏడాదికి రూ.15వేల దాకా లబ్ధిపొందే అవకాశముంది. అయినప్పటికీ గడిచిన మూడేళ్లలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, పంజాబ్‌లతో పోలిస్తే ఏపీ, తెలంగాణల్లో ఆ ప్లాంట్లు అరకొరగానే ఏర్పాటయ్యాయి. 2022 నాటికి దేశీయంగా 0.3శాతం కుటుంబాలే వంటకు బయోగ్యాస్‌ను వాడుతున్నాయి. వాటి సంఖ్య పెరగాలంటే పల్లెల్లో సర్పంచులు క్రియాశీలకంగా వ్యవహరించాలి. శాసనసభ్యులు సైతం తమ నియోజకవర్గాల్లో బయోగ్యాస్ ప్లాంట్లను విరివిగా ఏర్పాటు చేయించడానికి చొరవ తీసుకోవాలి. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లే బయోగ్యాస్ కేంద్రాల నిర్మాణంలో ముందుండే గ్రామాలకూ ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించాలి. ఈ కేంద్రాల నుంచి లభించే సహజసిద్ధ ఎరువు పంటభూముల పునరుజ్జీవానికి తోడ్పడుతుంది. రసాయన ఎరువులకు ధారపోసే డబ్బును ఆదాచేసి, వాటితో కొనితెచ్చుకుంటున్న దుష్ప్రభావాలను తప్పిస్తుంది!వంటగ్యాస్ ఉత్పత్తిలో ప్రతి గ్రామమూ స్వయంసమృద్ధమైతే సుస్థిరాభివృద్ధికి అదో చోదకశక్తి అవుతుంది. వ్యర్థాల సమస్యకు పరిష్కారం చూపించే బయోగ్యాస్ కేంద్రాలు పర్యావరణానికి ఎంతో మేలుచేస్తాయి. వాటి నిర్మాణం, నిర్వహణ, మరమ్మతుల పరంగా కొత్త ఉద్యోగావకాశాలు అందిరావడం దీంతో ఒనగూడే అదనపు లాభం! ఎల్‌పీజీ సిలిండర్లతో పోలిస్తే ఇండక్షన్, ఎలక్ట్రిక్ పొయ్యిల వినియోగంతోనూ ఖర్చు కలిసివస్తుంది. పట్టణవాసులు వంటకు కరెంటును సద్వినియోగం చేసుకుంటే గ్యాస్ కొరతపై కలత చెందాల్సిన పనుండదు. ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల బిగింపు ద్వారా విద్యుదుత్పత్తికి కేంద్రం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తోంది. దాన్ని ఉపయోగించుకుంటే ఇంటింటి బడ్జెట్లు దిగివస్తాయి. అయిదు వందల రూపాయలతోనే ఒకరికి సరిపడా అన్నం, కూరలను ఒకేసారి సిద్ధంచేసే సౌర కుక్కర్‌ను ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ ఇటీవల రూపొందించారు. ఇటువంటి ఉపకరణాల తయారీని ప్రభుత్వాలెంతగా ప్రోత్సహిస్తే ప్రజలకు అంతగా ఉపయుక్తమవుతుంది!

# అగమ్యగోచరంగా ఆర్థిక భవిష్యత్తు

విజయవాడ, ఏప్రిల్ 7,

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కాగ్ వెల్లడించిన గణాంకాలు కేవలం అంకెలు రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు హెచ్చరికలు అని ఆర్థిక వేత్తలు చెబుతున్నారు. ప్రభుత్వం ఆదాయ వ్యయాల మధ్య సమతుల్యత పాటించడంలో విఫలమవడమే కాకుండా, దీర్ఘకాలిక ప్రయోజనాలను పక్కన పెట్టి కేవలం తాత్కాలిక అవసరాల కోసమే ప్రాధాన్యత ఇస్తోందని. తెచ్చిన అప్పుల్లో సింహభాగం అనుత్పాదక వ్యయానికే ఖర్చు చేస్తూ, సంపద సృష్టిని పూర్తిగా గాలికొదిలేయడం రాష్ట్ర ఆర్థిక పునాదులను బలహీనపరుస్తోందని అంటున్నారు. ఏ రాష్ట్రానికైనా ఆర్థిక స్థిరత్వం రావాలంటే తెచ్చిన అప్పులను ఆస్తుల కల్పన కోసం వినియోగించాలి. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు మెరుగుపడితేనే భవిష్యత్తులో కొత్త ఆదాయ వనరులు పుట్టుకొస్తాయి. కానీ ఏపీ ప్రభుత్వం తెచ్చిన అప్పుల్లో కేవలం 24 శాతం మాత్రమే ఇలాంటి అభివృద్ధి పనులకు వెచ్చిస్తోంది. మిగిలిన 75 శాతం పైగా నిధులు కేవలం పాత అప్పుల వడ్డీలు, జీతాలు, పెన్షన్లు, ఉచిత పథకాలకే సరిపోతున్నాయి. దీనివల్ల రాష్ట్రం అప్పు తెచ్చి పాత అప్పు కట్టే ప్రమాదకరమైన డెట్ ట్రాప్ లో చిక్కుకుంటోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ లోపించడం వల్ల రెవెన్యూ లోటు గణనీయంగా పెరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య బాధ్యత , బడ్జెట్ నిర్వహణ చట్టం నిర్దేశించిన 2.7 శాతం లక్ష్యాన్ని దాటి రెవెన్యూ లోటు 3.75 శాతానికి చేరుకుంది. ప్రభుత్వం తన సొంత అవసరాల కోసం ఆదాయాన్ని సమకూర్చుకోలేక నిరంతరం రుణాల వైపు మొగ్గు చూపుతోంది. గత రెండేళ్లలోనే సుమారు 3.20 లక్షల కోట్ల రూపాయల కొత్త అప్పులు చేయడం ద్వారా రాష్ట్రం గత ఐదేళ్ల అప్పుల రికార్డులను సమం చేసింది. ఇది ఖజానాపై మోయలేని భారాన్ని పెంచుతోంది. రాష్ట్ర ప్రభుత్వం తన రోజువారీ ఖర్చుల కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న ఓవర్‌డ్రాఫ్ట్ మరియు వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులపైనే పూర్తిగా ఆధారపడుతోంది. 2024-25 సంవత్సరంలో కేవలం ఎనిమిది రోజులు తప్ప, మిగిలిన అన్ని రోజులు ప్రభుత్వం అడ్వాన్సుల ద్వారానే నిధులను సేకరించింది. ఏడాది కాలంలో సుమారు 1.72 లక్షల కోట్ల రూపాయలను ఈ రూపంలో తీసుకోవడం ఆర్థిక సంక్షోభ తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఇలా తీసుకున్న నిధులకు అదనంగా వందల కోట్ల రూపాయల వడ్డీ చెల్లించాల్సి రావడం వల్ల రాష్ట్రం అప్పుల చక్రబంధంలో చిక్కుకుంటోంది.సంపద సృష్టి విషయంలో ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం రాబోయే తరాలపై మోయలేని భారాన్ని మోపుతోందని అంటున్నారు. సొంత పన్ను ఆదాయం పెంచుకునే దిశగా పారిశ్రామికీకరణ , వాణిజ్య అభివృద్ధిపై దృష్టి సారించకుండా, కేవలం అప్పుల మీద అప్పులు చేసుకుంటూ పోవడం ఆత్మాహుతి సదృశమే అవుతుంది. ద్రవ్యలోటు కేంద్రం విధించిన 4 శాతం పరిమితిని దాటి 5.1 శాతానికి చేరడం అంటే, రాష్ట్రం తన ఆర్థిక స్వయంప్రతిపత్తిని కోల్పోవడానికి సిద్ధపడటమేనని చెబుతున్నారు. ప్రభుత్వం కేవలం సంక్షేమ మంత్రాన్నే నమ్ముకోకుండా, సంపద సృష్టించే మార్గాల వైపు అడుగులు వేయాలి. ఆదాయం లేని ఖర్చు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుప్పకూలుస్తుందని.. అనుత్పాదక వ్యయాన్ని కఠినంగా తగ్గించుకుని, పెట్టుబడి వ్యయాన్ని పెంచినప్పుడే రాష్ట్రం గడ్డు పరిస్థితుల నుంచి గట్టెక్కుతుందని ఆర్థిక నిపుణులు అంటున్నారు.

# రాయలసీమలో ఫ్యాన్ కు ఉక్కపోత

కర్నూలు, ఏప్రిల్ 7,

వైసీపీ అధికారంలో లేదు. అందరూ కలసి కట్టుగా పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే రాయలసీమ నేతలు మాత్రం ఒకరినొకరు తిట్టుకుంటూ పార్టీ పరువును నడి బజారున పడేస్తున్నారు. పార్టీ హైకమాండ్ కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో మరింత సీమ వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. రాయలసీమ వైసీపీలో నేతల మధ్య అంతర్గత విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. ముఖ్యంగా కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో గ్రూపు రాజకీయాలు, టికెట్ల పంచాయితీలు పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మాత్రం సీమ నేతల చిందులను చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.ఎమ్మిగనూరులో చెన్నకేశవరెడ్డి, బుట్టా రేణుక వర్గాల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. ఇరు వర్గాలు వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నాయి. ఎమ్మిగనూరులో సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి కుటుంబానికి, మాజీ ఎంపీ బుట్టా రేణుక వర్గానికి మధ్య తీవ్ర ఘర్షణ నడుస్తోంది. కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. సింగనమలలో వర్గపోరు, కదిరిలో నేతల ఘర్షణలు తరచుగా రోడ్డెక్కుతున్నాయి. సింగనమల నియోజకవర్గంలో వైసీపీ నేతల అంతర్గత పోరుబహిరంగంగా బయటపడుతోంది. కదిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు చెప్పులతో కొట్టుకునే స్థాయికి విభేదాలు తీవ్రమయ్యాయి.ఇక అనంతపురం జిల్లాలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరుకున్నాయి. పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వాళ్లను వెంటేసుకుని తిరుగుతున్నారంటూ తోపుదర్తి ప్రకాశ్ రెడ్డి ఫైర్ అయ్యారు. ఒకసారి పార్టీ మారిన వారిని పార్టీలోకి తీసుకుంటే చెప్పుతో కొడతానంటూ కేతిరెడ్డి మండిపడ్డారు. ఇలా నేతల మధ్య ర్గ విభేదాలు రాబోయే కాలంలో పార్టీ బలాన్ని తగ్గిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. నేతల మధ్య సమన్వయం లేకపోవడం, ఆధిపత్య పోరు స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర రాజకీయ కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశముందన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

# లోకం మాధవి తీరు అంతంతే

విజయనగరం, ఏప్రిల్ 7

నెలిమర్ల జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి పై టీడీపీ నేతలు గుర్రుగా ఉన్నారు. గత ఎన్నికల్లో పొత్తులో భాగంగా నెలిమర్ల స్థానాన్ని టీడీపీ దక్కించుకుంది. లోకం మాధవి జనసేనలో నే కాదు.. ఏపీలోని మహిళ ఎమ్మెల్యేల్లో అత్యంత ధనవంతుల్లో ఒకరు. ఆమె ఆస్తులు వందల కోట్లు ఉంటాయి. గత ఎన్నికల్లో జనసేన నుంచి పోటీ చేసిన లోకం మాధవి గెలుపొందారు. అయితే జనసేన ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్థానిక టీడీపీ నాయకత్వంతో ఆమెకు కుదరడం లేదు. అనేక విషయాల్లో లోకం మాధవికి, టీడీపీ స్థానిక నేతలకు మధ్య పొసగడం లేదు.లోకం మాధవి తమను పట్టించుకోవడం లేదని టీడీపీ నేతలు ఇప్పటికే పలు సార్లు తమ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. కాంట్రాక్టు పనులు, నామినేటెడ్ పోస్టుల విషయంలో టీడీపీ నేతలను పట్టించుకోవడం లేదన్నది వారి ప్రధాన ఆరోపణ. అలాగే సంక్షేమ పథకాలు, పనుల ప్రారంభోత్సవాల్లోనూ తమకు ఆహ్వానం ఇవ్వడం లేదని వారు చెబుతున్నారు. తమకు ప్రాధాన్యం ఇవ్వకుండా లోకం మాధవి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, తాము గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడి గెలిపించిన సంగతిని మర్చిపోతే ఎలా అని ?డీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు.ఎ

# స్కూల్స్ దగ్గరకు స్వచ్ఛ రథాలు

విశాఖపట్టణం, ఏప్రిల్ 7,

గ్రామాల్లో పరిశుభ్రతే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా పనికిరాని వస్తువులను సేకరిస్తూ.. వాటికి బదులుగా నగదు, నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులు మరో నిర్ణయం తీసుకున్నారు. ఈ స్వచ్ఛ రథాలను ఇళ్ల వద్దకే కాకుండా పాఠశాలల వద్దకు కూడా పంపిస్తున్నారు. విద్యార్థుల నుంచి పనికిరాని వస్తువులను సేకరించి.. అందుకు బదులుగా వారికి అవసరమైన అట్టలు, పుస్తకాలు, పెన్నులు అందిస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ విధానం అమలు చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వచ్ఛ రథాలను తీసుకువచ్చింది. ఈ స్వచ్ఛ రథాలు ప్రతి వారం గ్రామాల్లోకి వెళ్తూ.. ఇంటింటి నుంచి చెత్త, పనికిరాని వస్తువులను సేకరిస్తూ ఉంటాయి. అందుకు బదులుగా ఉచితంగా నిత్యావసర సరుకులు అందిస్తుంటారు. ఈ స్వచ్ఛ రథం కాన్సెప్ట్‌ను కొన్నిచోట్ల ప్రయోగాత్మకంగా పరిశీలించగా.. మెరుగైన ఫలితాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పుడు చాలా చోట్ల స్వచ్ఛ రథాలను ఏర్పాటు చేస్తున్నారు. తాజాగా పాఠశాలల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకువస్తున్నారు.అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే ఈ ప్రక్రియ ప్రారంభమైంది. వారంలో ప్రతి గురువారం పాఠశాలలను సందర్శిస్తున్న స్వచ్ఛ రథాల సిబ్బంది.. విద్యార్థులు తెచ్చిన పనికిరాని వస్తువులను సేకరించి, వాటి విలువను లెక్క గట్టి.. అందుకు బదులుగా పెన్నులు, పుస్తకాలు, అట్టలు అందిస్తున్నారు. ఇళ్లలోని పనికి రాని వస్తువులను తీసుకుంటున్న స్వచ్ఛ రథం సిబ్బంది.. వాటికి బదులుగా గ్రామస్థులకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. అలాగే ఇప్పుడు గురువారం రోజున పాఠశాలల వద్దకు వెళ్లి.. స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థుల వద్ద నుంచి ప్లాస్టిక్ వస్తువులు, లోహపు వస్తువులను స్వీకరించి.. మార్కెట్ ధరకు అనుగుణంగా నగదు లేదా అవసరమైన సరుకులు అందిస్తున్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన అట్టలు, పెన్నులు, పుస్తకాలు అందిస్తున్నారు.మరోవైపు స్వచ్ఛ రథం సిబ్బంది కేజీ ఇనుముకు రూ.20, పాత పేపర్లకు రూ.15, పుస్తకాలు, అట్టపెట్టెలకు రూ.10, కేజీ ప్లాస్టిక్ సీసాలు రూ.20, అల్యూమినియం వస్తువులు అయితే రూ.120 చొప్పున చెల్లిస్తున్నారు. వీటికి బదులుగా కొబ్బరి నూనె, సబ్బులు, ఉల్లిపాయలు, గోధుమ పిండి, కందిపప్పు వంటి నిత్యావసర సరకులు అందిస్తున్నారు. సరకులు అవసరం లేని వారికి నగదు అందిస్తున్నారు.

మరో వైపు పాఠశాలల్లో ఎక్కువగా పొడి చెత్త ఉత్పన్నం అవుతోంది. దీని వలన పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందనే ఉద్దేశంతో స్కూళ్ల వద్దకు కూడా స్వచ్ఛ రథాలను తీసుకువస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగానూ ఈ విధానాన్ని అమలు చేసే ఆలోచనలో అధికారులు ఉన్నారు.

# ఏపీ మీదుగా మూడు హైస్పీడ్ రైలు కారిడార్లు

కర్నూలు ఏప్రిల్ 7,

ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీ మీదుగా మూడు హైస్పీడ్ రైల్వే కారిడార్లను ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా బెంగళూరు చెన్నై హైస్పీడ్ రైలు కారిడార్ తిరుపతి, నాయుడుపేట మీదుగా వెళ్లేందుకు కేంద్రం ఓకే చెప్పింది. ఈ కనెక్టవిటీతో అమరావతికి రెండో హైస్పీడ్ కారిడార్ లింక్ కానుంది. సీఎం చంద్రబాబు రిక్వెస్ట్ మేరకు కేంద్రం ఈ ఎలైన్‌మెంట్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి రెండు హైస్పీడ్ రైల్ కారిడార్లకు కనెక్ట్ కానుంది. వాస్తవానికి ఏపీ మీదుగా మూడు కారిడార్లు వెళుతుండగా.. రెండు కారిడార్లు అమరావతితో లింక్ కాబోతున్నాయి. హైదరాబాద్-చెన్నై కారిడార్‌ను ఇప్పటికే అమరావతితో కనెక్ట్ చేయాలని కేంద్రం నిర్ణయించగా.. తాజాగా మైసూరు-చెన్నై కారిడార్ విషయంలోనూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తాజాగా బెంగళూరు-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్‌ను చిత్తూరు నుంచి తిరుపతి మీదుగా నాయుడుపేటకు లింకు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు తెరపైకి వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు వినతితో ఈ ప్రతిపాదనకు కేంద్రం ఓకే చెప్పినట్లు తెలుస్తోంది.ఇప్పటికే హైదరాబాద్ టు చెన్నై కారిడార్ అమరావతి మీదుగా గుంటూరు, చీరాల, ఒంగోలు, నెల్లూరు, నాయుడుపేట, శ్రీసిటీ మీదుగా చెన్నైకి ఏర్పాటు కానుంది. తాజా ప్రతిపాదనల ప్రకారం నాయుడుపేట, తిరుపతి, చిత్తూరు, బంగారుపాళ్యం, బెంగళూరు, మాండ్య మీదుగా మైసూరుకు రెండో కారిడార్ అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు. తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రతో పాటుగా తమిళనాడు, కర్ణాటకలకు ఉపయోగపడేలా హైస్పీడ్ కారిడార్లను కేంద్రం ప్లాన్ చేసింది. వీటిలో హైదరాబాద్ టు చెన్నై, హైదరాబాద్ టు బెంగళూరు, బెంగళూరు-చెన్నై కారిడార్లు ఉన్నాయి. అయితే ఈ కారిడార్లలో తిరుపతిని చేర్చలేదు.బెంగళూరు-చెన్నై కారిడార్‌ను చిత్తూరు, తిరుపతి మీదుగా నాయుడుపేటకు కనెక్ట్ చేయలని చంద్రబాబు నాయుడు కేంద్రానికి ప్రతిపాదించారు. హైదరాబాద్-చెన్నై కారిడార్ ఎలైన్‌మెంట్‌లో ఇప్పటికే అమరావతిని కనెక్ట్ చేయగా.. తాజా ప్రతిపాదనలతో అమరావతికి, చెన్నై, బెంగళూరుతోపాటు మైసూరుతోనూ హైస్పీడ్ రైలు కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీనికి సంబంధించి, వచ్చే ఏడాది నాటికి డీపీఆర్ రూపొందించాలని భావిస్తున్నారు. హైదరాబాద్-చెన్నై ఎలైన్‌మెంట్‌ను రైల్వేశాఖ ఏపీలో అమరావతి మీదుగా ప్రతిపాదించింది. హైదరాబాద్-బెంగళూరు మార్గం రాయలసీమ ప్రాంతం మీదుగా వెళుతోంది. మరో హైస్పీడ్ కారిడార్ బెంగళూరు-చెన్నై మధ్య ప్లాన్ చేసింది. అయితే ఈ అంశాలపై క్లారిటీ రావాల్సి ఉంది.హైదరాబాద్-బెంగళూరు కారిడార్ ఏపీలోని కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల మీదుగా వెళుతుంది. చెన్నై-బెంగళూరు మధ్య కారిడార్ ఏపీలోని చిత్తూరు జిల్లా మీదుగా వెళ్లేలా గతంలో ప్లాన్ చేశారు. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం రిక్వెస్ట్‌తో తిరుపతి, నాయుడపేటను కూడా ఈ అలైన్‌వెం? చేర్చారు. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్ పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల మీదుగా వెళుతుంది.



# రీ ఎంట్రీకి విజయసాయిరెడ్డి...

నెల్లూరు, ఏప్రిల్ 7,

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒక గందరగోళ పరిస్థితి కనిపిస్తోంది. ముఖ్యంగా రాజధాని ప్రతిపాదన విషయంలో జగన్ చుట్టూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకు ఆ పార్టీకి టిడిపి, జనసేన బలమైన ప్రత్యర్థులుగా ఉన్నారు. కానీ ఆ జాబితాలో ఇప్పుడు చాలా పార్టీలు వచ్చి చేరుతున్నాయి. చివరకు



ఇప్పటివరకు స్నేహంగా వ్యవహరించిన గులాబీ పార్టీ సైతం రూటు మార్చుకున్నట్టు కనిపిస్తోంది. అమరావతి రాజధాని విషయంలో పక్కన ఉన్న తెలంగాణలో సైతం జగన్మోహన్ రెడ్డి పట్ల ప్రతికూలత వస్తోంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లు పై చర్చ జరిగిన సమయంలో కాంగ్రెస్ సభ్యురాలు రేణుకా చౌదరి మాటలు చూస్తే మాత్రం జగన్ పై వ్యతిరేకత ఎలా ఉందో అర్థమవుతుంది. మరోవైపు అది చాలదన్నట్టు జగన్మోహన్ రెడ్డి మావిగన్ రాజధాని ప్రతిపాదనను సొంత పార్టీ శ్రేణులు వ్యతిరేకిస్తున్నాయి. ఎప్పుడు సోషల్ మీడియాలో జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా ప్రచారం చేసేవారు సైతం దిక్కుమాలిన సలహా అంటూ విరుచుకుపడుతున్నారు. మావిగన్ ప్రతిపాదన అనేది జగన్మోహన్ రెడ్డి సొంత నిర్ణయం అని సజ్జల లాంటి వారు మీడియా ముందుకు వచ్చి చెప్తున్నారు.అయితే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్మోహన్ రెడ్డి నిర్ణయం ఫైనల్ అన్నట్టు ఉండేది. జగన్ పై ఈగ వాలితే అంతా పడిపోయేవారు. కానీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చించే క్రమంలో జగన్మోహన్ రెడ్డిని టార్గెట్ చేసుకున్నాయి వివిధ పార్టీలు. కానీ కనీసం కౌంటర్ ఇవ్వలేకపోయారు ఆ పార్టీ నేతలు. నిండు రాజ్యసభలో జగన్మోహన్ రెడ్డి పై కాంగ్రెస్ ఎంపీలు విరుచుకుపడితే ఏం చేస్తున్నట్టు అని ఆ పార్టీకి గుడ్ బై చెప్పిన ఎంపి విజయసాయిరెడ్డి ప్రశ్నించారు. ఇదేనా మీ సమర్థత అంటూ ప్రశ్నించడం ప్రారంభించారు. ఇక్కడ విజయసాయిరెడ్డి రెండు రకాల లక్ష్యాలను నెరవేర్చుకున్నారు. ఒకటి తనలాంటి వాడు జగన్ వెంట లేకపోవడం లోటు అని సంకేతాలు పంపాడు. కేంద్ర రాజకీయాల్లో వైసీపీకి అత్యవసరంగా ఒక నేత అవసరం అని గుర్తు చేశారు.మరోవైపు కూటమికి వ్యతిరేకంగా ట్వీట్ చేశారు విజయసాయిరెడ్డి. అమరావతి రాజధాని కి చట్టబద్ధత కల్పించడం ఎంత ముఖ్యమో.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు న్యాయం చేయడం అంతే ముఖ్యం అని హెచ్చరిస్తూ స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. కొత్త రాజధాని ప్రతిపాదన కంటే రైతుల సమస్యలపై వైసీపీ పోరాడితే బాగుంటుందని సూచనలు ఇచ్చారు. అయితే ఇప్పటికీ తాను కూటమికి వ్యతిరేకమని.. అవసరం అనుకుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చేందుకు సిద్ధమని సంకేతాలు పంపగలరు. ఏడాది కిందట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీ ద్వారా వచ్చిన రాజ్యసభ పదవికి రాజీనామా చేశారు విజయసాయిరెడ్డి. వ్యవసాయం చేసుకుంటానని చెప్పిన ఆయన తరువాతే ఎందుకో రాజకీయాలు మాట్లాడుతూ వచ్చారు. రాజకీయాలు చేయాలని ఉందని చెప్పుకొచ్చారు. బిజెపిలోకి వెళ్తారని కూడా ప్రచారం జరిగింది. కానీ కూటమి నుంచి అభ్యంతరాలు రావడంతో ఆయన డిఫెన్స్ లో పడిపోయారు. అందుకే జగన్ ఒప్పుకుంటే తిరిగి వైసీపీలో చేరుతానని సంకేతాలు పంపుతున్నారు. కానీ జగన్ అందుకు ఒప్పుకుంటారో? లేదో? చూడాలి.

==========================

# గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్

విజయవాడ, ఏప్రిల్ 7

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. రాష్ట్రపతి ఆమోదం నేపథ్యంలో కేంద్ర న్యాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ పునర్వవస్థీకరణ చట్టంలోని సబ్ సెక్షన్ -2లో రాజధానిగా అమరావతిని పేర్కొంటూ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2024 జూన్ 2 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని తెలిపింది.ఏపీ రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించింది. పార్లమెంట్ ఆమోదం అనంతరం అమరావతి బిల్లు రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. ఈ బిల్లును పరిశీలించిన అనంతరం.. న్యాయ నిపుణులతో సంప్రదింపుల తర్వాత రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీ పునర్వవస్థీకరణ చట్టంలోని సబ్ సెక్షన్ 2లో రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర న్యాయ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం జూన్ 2, 2024 నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని పేర్కొన్నారు.ఏపీ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లును కేంద్రం ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా.. ఉభయసభలు ఆమోదం తెలిపాయి. సుమారు ఐదు గంటలు లోక్‌సభ, రాజ్యసభల్లో అమరావతి బిల్లుపై చర్చ జరిగింది. అనంతరం ఎలాంటి సవరణలు ప్రతిపాదించకుండానే అమరావతికి బిల్లుకు లోక్ సభ, రాజ్యసభలు ఆమోదం తెలిపాయి. దీంతో లోక్‌సభ సచివాలయం అమరావతి బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపించగా.. రాష్ట్రపతి సోమవారం రోజున అమరావతి బిల్లుకు ఆమోద ముద్ర వేశారు. దీంతో అమరావతి బిల్లు చట్టరూపం దాల్చింది.

# రాజమండ్రిలో భారీ ఈవెంట్

రాజమండ్రి, ఏప్రిల్ 7,

ఆంధ్రుల సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరం ప్రపంచ స్థాయి భారీ ఈవెంట్ కు వెల్కమ్ చెబుతోంది. ఈ బోట్ రేసింగ్ లాంచ్ ఈవెంట్ రాజమండ్రి లో జరుగుతుంది. మే నెలలో మూడు రోజుల పాటు గోదావరి లో ఈ బోట్ రేసింగ్ జరగబోతోంది. డ్రాగన్ బోట్ లీగ్ పేరుతో జరిగే బోట్ రేసింగ్ ఈవెంట్ ఇండియా లో జరగడం ఇదే తొలిసారి. ఏకంగా 25 దేశాల నుండి 1200మందికి పైగా క్రీడాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.డ్రాగన్ బోట్ రేసింగ్ అనేది చైనా ప్రాచీన పడవ పోటీల క్రీడ. లయ బద్ధంగా మూగే డప్పు శబ్దాల కనుగుణంగా వేగంగా వెళ్లే పడవ పోటీలు ఇవి. మనదేశం లోనూ కేరళ, ఆత్రేయపురం ప్రాంతాల్లో ఇలాంటి పోటీలే జరుగుతూ ఉన్నా ఇంత భారీ స్థాయిలో మనదేశం లో జరగడం మాత్రం ఇదే తొలిసారి.రాజమండ్రిని సాంస్కృతికపరంగా ఇప్పటికే ఆంధ్రులు రాజధానిగా భావిస్తారు. దానిని టూరిజం ఈవెంట్ల పరంగా కూడా పూర్తిస్థాయిలో డెవలప్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ లో చాలా ఈవెంట్లు ప్లాన్ చేస్తున్నారు. వచ్చే ఏడాది జరిగే పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని వేగంగా అభివృద్ధి పనులు కూడా చేస్తున్నారు. వాటికి డ్రాగన్ బోట్ రేసింగ్ లాంటి ఈవెంట్లు మరింత సహాయం చేస్తాయని నిర్వాహకులు చెప్తున్నారు.డ్రాగన్ బోట్ రేసింగ్ 2026 " లోగో, షెడ్యూల్, డ్రెస్ కోడ్ రాజమండ్రి ఓఎం ఆదిరెడ్డి శ్రీనివాస్ సమక్షంలో రిలీజ్ చెయ్యబోతున్నారుఈ ఇంటర్నేషనల్ డ్రాగన్ బోట్ రేసింగ్ -2026) లో 25 దేశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొనబోతుండగా ఇప్పటికే 12కు పైగా దేశాలు కన్ఫర్మ్ అయ్యాయి.

# సర్వేలతో టెన్షన్.. టెన్షన్...

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7,

ఏప్రిల్, మే నెలలో నాలుగు రాష్ట్రాల్లో జరిగే ఎన్నికలపై దేశమంతా ఆసక్తిగా ఫోకస్ చేసింది. ఎవరు అధికారంలోకి వస్తున్నారు, ఎవరి ప్రభావం ఎంత అనే డిస్కషన్ జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే ఆయా రాష్ట్రాల్లో ప్రజల అభిప్రాయాలు క్రమంగా వెలువడుతున్నాయి. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మమతా బెనర్జీ కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతున్నారు. ఆమెను ఎలాగైనా అధికారంలో నుంచి దించి కాషాయపు జెండా ఎగరేయాలని బీజేపీ ప్రతి వ్యూహాలతో ప్రయత్నాలు చేస్తోంది. కేరళలో యూడీఎఫ్, ఎల్‌డీఎఫ్ హోరాహోరీగా పోటీపడుతున్నాయి. అస్సాంలో కాంగ్రెస్ బీజేపీ ఢీ కొంటున్నాయి. అన్నింటి కంటే ఎక్కువ ఆసక్తిని కలిగించే ఎన్నికల తమిళనాడు అసెంబ్లీ పోరు. 292 సీట్లు ఉన్న పశ్చిమబెంగాల్‌లో మాట్రిజ్ ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ పోటీ అంచనాలు అందనంతగా ఉంది. తాజా సర్వేలో పార్టీలే షేక్ అయ్యే అభిప్రాయాలు ప్రజలు చెప్పారు. ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ 43 శాతం ఓట్లతో 140 నుంచి 160 సీట్లను గెలుచుకోగలదు. ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ 41 శాతం ఓట్లతో 130 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. రాష్ట్రంలోని ఇతర పార్టీలు 16 శాతం ఓట్లతో 8 నుంచి 16 సీట్లు గెలుచుకోగలవు. పశ్చిమ బెంగాల్‌లో 148 సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారంలోకి వస్తుంది. ఈ అభిప్రాయ సేకరణలో టీఎంసీకి 2 శాతం స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ ఈ తేడా చాలా తక్కువగా ఉండటంతో ఎన్నికల చిత్రం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు. మాట్రిజ్, చాణక్య నిర్వహించి ఒక సర్వే ప్రకారం అసోంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి పటిష్టమైన స్థితిలో ఉంటుంది. తిరిగి అధికారంలోకి రావడానికి ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నాయి. మ్యాట్రిక్స్ ప్రకారం బీజేపీ కూటమి 46 శాతం ఓట్లు వస్తే, కాంగ్రెస్ కూటమికి 36 శాతం ఓట్లు వస్తాయి. ఇతరులు 18 శాతం ఓట్లు వస్తాయి. 126 అసెంబ్లీ సీట్లు ఉన్న అస్సాంలో బీజేపీ కూటమికి 92 నుంచి 102 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 22 నుంచి 32 సీట్లు, ఇతరులకు 4 నుంచి 7 సీట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. చాణక్య సర్వే ప్రకారం అస్సాంలో బీజేపీ 83 నుంచి 90 సీట్లు, కాంగ్రెస్ కూటమికి 30 నుంచి 36 సీట్లు, ఇతరులు నాలుగు నుంచి ఏడు సీట్లలో గెలుచుకోగలరని చెబుతోంది. ఇండియా టీవీ ప్రసారమైన మ్యాట్రిజ్ అభిప్రాయం ప్రకారం, ఈసారి తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలల్లో అన్నా డీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ భారీ విజయం సాధించే అవకాశం ఉంది. ఈ అభిప్రాయ సేకరణ ప్రకారం, స్టాలిన్ పార్టీ అయిన డీఎంకే ఎన్నికల్లో 102 నుంచి 115 సీట్లు గెలుచుకోగలదు. బీజేపీ, ఏఐడీఎంకే కలిసి ఉన్న ఎన్డీఏ కూటమి 107 నుంచి 120 సీట్లు గెలుచుకుంటుందని అంచనా. విజయ్ అధ్యక్షత వహించిన టీవీకే ఐదు నుంచి 12 సీట్లు మాత్రమే గెలుచుకోగలదు. ఇతరులు 1 నుంచి ఆరు సీట్లు గెలుచుకుంటారని అంచనాలు చెబుతున్నాయి. ఇండియా టీవీలో ప్రసారమైన మ్యాట్రిజ్ అభిప్రాయ సేకరణ ప్రకారం, కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష కూటమి 62 నుంచి 68 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేయగా, కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమి 67 నుంచి 73 సీట్లు గెలుచుకుంటుందని సర్వే చెబుతోంది. 15 శాతం ఓట్లతో ఉన్న బీజేపీ 5 నుంచి 8 సీట్లు గెలుచుకుంటుందని అంచనా వేస్తున్నారు. ఇతరులు మూడు సీట్లలో విజయం సాధిస్తారని భావిస్తున్నారు.

## ప్రియుడి ఇంటిముందు యువతి మౌన పోరాటం

మహబూబాబాద్ ఏప్రిల్ 7,

పెళ్లికి ఒప్పుకోలేదని ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు మౌన పోరాటానికి దిగింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని గుండె శివారు వాగ్య తండాలో ఘటన జరిగింది. వాగ్య తండాకు చెందిన తేజావత్ రఘురాం, కేసముద్రం మండలం రేకుల తండాకు చెందిన గూగులోత్ స్పందన గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు.

అయితే, గత కొన్ని రోజులుగా రఘురాం పెళ్లికి నిరాకరిస్తుండగా.. ఈ విషయమై గతంలో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని యువతి తెలిపింది. దీంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ రఘురాం ఇంటి ఎదుట మౌన పోరాటానికి దిగింది.

## మాజీ మంత్రి హరీశ రావు హౌస్ అరెస్ట్

### పరిగి పర్యటనకు వెళ్లకుండా అడ్డగింత

హైదరాబాద్ ఏప్రిల్ 7,

మాజీ మంత్రి హరీష్ రావును పోలీసులు హౌస్ అరెస్టు చేసారు. ఇండస్ట్రియల్ పార్క్ బాధిత రైతులను కలిసేందుకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలపై ఆంక్షలు విధించారు. హరీశ్ రావు నివాసం వద్ద పోలీస్ బలగాలు భారీగా మోహరించాయి. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పలువురు ఉమ్మడి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల నేతలను కుడా గృహ నిర్బంధం చేసారు.

## మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అరెస్టు

పరిగి ఏప్రిల్ 7,

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి, కొడంగల్ నియోజకవర్గం బొంరాస్ పేట్ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటులో 1200 ఎకరాల భూములు కోల్పోతున్న బాధితులకు అండగా నిలిచేందుకు వస్తున్న హరీష్ రావును అడ్డుకునే ప్రయత్నంలో భాగంగానే అరెస్టులు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

## పోలీసు స్టేషన్ ముందు రైతుల అందోళన

పరిగి ఏప్రిల్ 7,

పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ పేరిట 1200 ఎకరాల రైతుల భూమిని గుంజుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రైతులు చేస్తున్న ఈ కార్యక్రమానికి పోలీసులు అనుమతి నిరాకరించారు. తమకు మద్దతుగా హరీష్ రావు వస్తున్నాడని అనుమతి ఇవ్వకుండా రైతులను పరిగి పోలీస్ స్టేషన్లో పెట్టినట్లు రైతులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో పోలీస్ స్టేషన్ ముందు కాళ్లాపూర్ రైతులు, గ్రామస్తుల ఆందోళన కు దిగారు. తమ 1200 ఎకరాలు పోతున్నాయని రైతులు చేస్తున్న రైతుల రిలే నిరవదిక దీక్షకు మద్దతుగా మంగళవారం హరీష్ రావు రానున్న నేపథ్యంలో పర్మిషన్ కోసం పోలీస్టేషన్కు గ్రామ రైతులు వచ్చారు. వారికి పోలీసులు పర్మిషన్ ను నిరాకరించించారు. శాంతియుతంగా నిరసన తెలిపితే పర్మిషన్ ఎందుకు ఇవ్వరు అంటూ రైతులు నిలదీసారు. పోలీస్టేషన్ ముందు కాళ్లపూర్ గ్రామస్తులు, రైతులు బైఠాయించారు. కొంతమంది రైతులను గ్రామస్తులను పోలీస్టేషన్ లోనే ఉంచివేసారు. ఈ ఆందోళనలో పోలీస్టేషన్ గేట్ ను పోలీసులు మూసివేయడంతో రైతులు గేటు పైకి ఎక్కి ఆందోళన చేపట్టారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

హైదరాబాద్ ఏప్రిల్ 7,

రక్తదానం ప్రాణదానంతో సమానమని దిశా లా ఫార్మ్ వ్యవస్థాపకుడు నాగేశ్వర్రావు పూజారి అన్నారు. నిమ్స్ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో పంజాగుట్ట ద్వారకాపురి కాలనీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 30 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాని నిమ్స్ బ్లడ్ బ్యాంక్ కు అందజేశారు. రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా వచ్చిన వారిని నాగేశ్వర రావు పూజారి అభినందించారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ మూడు నెలకొకసారి రక్తదానం చేయొచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీని యర్ రెసిడెంట్ డా. పుష్పజ, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## డీజీపీ కాన్వాయ్ ట్రయల్ రన్ రెండు పోలీసు వాహనాల ఢీ..తప్పిన ప్రమాదం

ములుగు ఏప్రిల్ 7,

ఏజెన్సీలో డీజీపీ కాన్వాయ్ ట్రయల్ రన్ లో పోలీసులకు ప్రమాదం తప్పింది. ములుగు జిల్లా వెంకటాపురం మండలం శివారులో 10 మంది పోలీసులకు ప్రమాదం తప్పింది. ట్రయల్ రన్ లో భాగంగా ముందు వెళ్తున్న వాహనాన్ని వెనక నుండి అతివేగంగా వచ్చిన పోలీసు వాహనం ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో ట్రయల్ రన్ వాహనాలు. దెబ్బతిన్నాయి. . ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

# కాల్పుల విరమణ అడుగులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 7,

అమెరికా మరియు ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను తగ్గించి, యుద్ధాన్ని నిలిపివేసేందుకు అంతర్జాతీయ స్థాయిలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గత ఫిబ్రవరి 28 నుండి కొనసాగుతున్న అమెరికా-ఇజ్రాయెల్ మరియు ఇరాన్ యుద్ధానికి తాత్కాలికంగా ముగింపు పలికేందుకు ఒక ముసాయిదా ప్లాన్ సిద్ధమైంది. దీని ప్రకారం 45 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలని మధ్యవర్తులు ప్రతిపాదించారు. ఈ గడువులోగా రెండు దేశాలు చర్చలు జరిపి, యుద్ధానికి శాశ్వత ముగింపు పలికేలా ఒక సమగ్ర ఒప్పందానికి రావాలనేది ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశ్యం.ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని ఈ ప్రతిపాదనలో సూచించారు. ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో గ్లోబల్ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. అయితే, దీనిని తెరవాలంటే అమెరికా తన ఆంక్షలను సడలించాలని, కేవలం తాత్కాలిక కాల్పుల విరమణ కోసం జలసంధిని తెరవలేమని ఇరాన్ స్పష్టం చేస్తోంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు పాకిస్థాన్, ఈజిప్ట్ , తుర్కియే దేశాలు చురుగ్గా వ్యవహరిస్తున్నాయి. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ నేతృత్వంలో ఈ చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. అమెరికా ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ , ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య ఈ మూడు దేశాలు రాయబారం నడుపుతున్నాయి. ఇస్లామాబాద్ అకార్డ్ పేరుతో ఈ ఒప్పందాన్ని ఖరారు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. హర్మ్యూజ్ జలసంధిని తెరవకపోతే ఇరాన్‌లోని కీలక మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలు, వంతెనలపై భారీ దాడులు చేస్తామని హెచ్చరించారు. అయితే, చర్చలు సఫలమయ్యే అవకాశాలు ఉన్నాయని, సోమవారం నాటికి ఒక నిర్ణయం వచ్చే అవకాశం ఉందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఒప్పందం గనుక కుదిరితే, గత ఆరు వారాలుగా ప్రపంచాన్ని వణికిస్తున్న యుద్ధం ఆగిపోయి, చమురు సరఫరా యథాతథ స్థితికి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఇరాన్ ఈ జలసంధి గుండా కేవలం కొన్ని ఎంపిక చేసిన దేశాల నౌకలను మాత్రమే అనుమతిస్తోంది. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు ఆటంకం కలుగుతోంది. అయితే, మధ్యవర్తుల ప్రతిపాదన ప్రకారం, యుద్ధం ముగిసేలోపు ఇరాన్ ఈ జలసంధిని పూర్తిగా తెరవాల్సి ఉంటుంది. దీనికి ప్రతిగా అమెరికా తన దాడులను నిలిపివేసి, శాంతి చర్చలకు మొగ్గు చూపాలని సూచించారు.ఈ చర్చల్లో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన ఆదివారం రాత్రంతా అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, చర్చల ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలతో ఫోన్లో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. అమెరికా పంపిన 15 అంశాల శాంతి ప్రణాళికను కూడా పాకిస్థాన్ ఇరాన్‌కు చేరవేసింది. అయితే, అమెరికా డిమాండ్లు చాలా కఠినంగా ఉన్నాయని ఇరాన్ ప్రాథమికంగా పెదవి విరిచింది.ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ విదేశాంగ శాఖ స్పందిస్తూ.. అల్టిమేటంలు, యుద్ధ నేరాలకు పాల్పడతామనే బెదిరింపుల మధ్య చర్చలు జరపడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. గత కొద్ది రోజులుగా ఇజ్రాయెల్, అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్‌లోని యూనివర్సిటీలు, ఆసుపత్రులు, చమురు కేంద్రాలు దెబ్బతిన్నాయని, దీనికి పరిహారం చెల్లిస్తేనే జలసంధిని తెరుస్తామని కొందరు ఇరాన్ అధికారులు వాదిస్తున్నారు. అలాగే, గాజా లేదా లెబనాన్ తరహాలో పేరుకు కాల్పుల విరమణ ఉండి, అమెరికా ఎప్పుడు పడితే అప్పుడు దాడులు చేస్తుందనే భయం కూడా ఇరాన్‌లో నెలకొంది.ఇప్పటివరకు జరిగిన అమెరికా-ఇజ్రాయెల్ , ఇరాన్ యుద్ధంలో ఇరాన్‌లో 2,000 మందికి పైగా మరణించారు. లెబనాన్‌లో 1,500 మంది, ఇరాక్ , గల్ఫ్ దేశాల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అమెరికా కూడా 13 మంది సైనికులను కోల్పోయింది. ట్రంప్ విధించిన గడువు లోపు మధ్యవర్తుల ప్రయత్నాలు సఫలమైతేనే ప్రపంచం మరో పెను విపత్తు నుంచి తప్పుకునే అవకాశం ఉంటుంది.

# ట్రెండింగ్ లో మావిగన్...

విజయవాడ, ఏప్రిల్ 7

సోషల్ మీడియాలో ప్రతీ రోజూ చాలా ట్రెండ్ అవుతుంటాయి. అలా ఫేమస్ అయిన పదాలు, క్రైమ్ స్టోరీస్, రియల్ సంఘటనలను మూవీస్‌గా తెరకెక్కించడం మనం చూశాం. కొన్నింటిని సాంగ్ లిరిక్స్‌లోనూ వాడుతుంటారు. గతంలో చాలా వరకూ అలాంటి ట్రెండింగ్ వర్డ్స్ సినిమాలుగా వచ్చాయి. తాజాగా అలాంటి రీసెంట్ వర్డ్‌ను మూవీ టైటిల్‌గా రిజిస్టర్ చే?యించినట్లు ప్రచారం సాగుతోంది. రెండు రోజులుగా ఏ నోట విన్నా, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మావిగన్ పేరే వినిపిస్తోంది. ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ తాజా ప్రెస్ మీట్‌లో ఈ కొత్త పదాన్ని ఇంట్రడ్యూస్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అమరావతిని శాశ్వత రాజధానిగా చట్టబద్ధత కల్పించిన సందర్భంగా... ఆయన ప్రెస్ మీట్ పెట్టారు. ఈ బిల్లును వైసీపీ ఎంపీలు వ్యతిరేకించారు. ఈ క్రమంలో జగన్ ప్రెస్ మీట్‌లో మచిలీపట్నం - విజయవాడ - గుంటూరు ప్రాంతాలను కలుపుతూ రాజధాని ఏర్పాటు చేయాలంటూ కొత్త ప్రతిపాదన తెరపైకి తెచ్చారు. మచిలీపట్నంలో ఓం, విజయవాడలో ఎవి, గుంటూరులో ఉజఔను తీసుకుని ఓంఎవిఉ జఔ అని పేరు పెట్టాలని సూచించారు. ఈ పేరు నచ్చకపోతే అమరావతి పేరుతోనే ఆ ప్రాంతాన్ని కాపిటల్‌గా చేయాలని అన్నారు. దీంతో ఆ పేరు మార్మోగుతోంది. మావిగన్ ప్రతిపాదనపై జగన్ సపోర్టర్స్ ఆయనకు మద్దతుగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతుంటే... కొందరు వైసీపీ అధినేతపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఆ పార్టీ నేతలు సైతం భవిష్యత్తులో మావిగన్ రాజధాని అవుతుందంటూ కామెంట్స్ చేస్తున్నారు. అలా ఈ పదం వైరల్ అయ్యింది. ఈ క్రమంలో పేరుతో టాలీవుడ్ ప్రొడ్యూసర్ ఫిలిం ఛాంబర్‌లో టైటిల్ రిజిస్టర్ చేయించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో ఈ పేరుతో మూవీ తీయబోతున్నారంటూ ప్రచారం సాగుతోంది. ఇందులో నిజా నిజాలు తెలియాల్సి ఉంది. మరి పేరుతో ఎలాంటి జానర్ మూవీ తీస్తారో అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. పొలిటికల్ జానర్ అయితే బెటర్ అంటూ సలహాలు ఇస్తున్నారు.

సజ్జలకు తగ్గుతున్న ప్రాధాన్యం..

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మావిగన్ రాజధాని ప్రతిపాదన కుదిపేస్తోంది. ముఖ్యంగా ఈ ప్రతిపాదన వెనుక సలహాదారులు ఉన్నారు అన్నది అనుమానం. అయితే అది ఎవరన్నది మాత్రం తెలియడం లేదు. కానీ సజ్జల రామకృష్ణారెడ్డి లాంటివారు అది పూర్తిగా జగన్మోహన్ రెడ్డి ఐడియా అని మీడియా ముందుకు వచ్చి చెప్పారు. అయితే సజ్జల ప్రత్యేకంగా చెప్పడం వెనుక వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. గత కొద్దిరోజులుగా తాడేపల్లి కార్యాలయంలో జరిగిన పరిణామాల క్రమంలోనే ఆయన మీడియా ముందుకు వచ్చి మాట్లాడాల్సి వచ్చింది. సజ్జల వర్సెస్ చెవిరెడ్డి యుద్ధం ఈ వ్యవహారంతో పతాక స్థాయికి చేరినట్లు వైసీపీలోనే ప్రచారం నడుస్తోంది. ఈ వింతైన పేరు, ప్రతిపాదన వెనుక చెవిరెడ్డి వ్యూహం ఉందనే ప్రచారం జరగడంతో.. మావిగన్ నెపం తన పైకి రాకుండా సజ్జల రామకృష్ణారెడ్డి జాగ్రత్త పడినట్లు కనిపిస్తున్నారు. ప్రతిపాదన అనేది ఇప్పుడు చేసేది కాదు. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే జగన్మోహన్ రెడ్డి ఈ సూచన చేసి ఉంటే చాలా బాగుండేది. ఒకవైపు అమరావతి నిర్మాణం కొనసాగుతోంది. దానిని నిలిపివేసి జగన్మోహన్ రెడ్డి మూడు రాజధానులు తెచ్చారు. అమరావతి పనులను అడ్డుకొని దానిని ఒక స్మశానంతో పోల్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులు పునః ప్రారంభం అయ్యాయి. ఇటువంటి సమయంలో జగన్ మావిగన్ ప్రతిపాదన ఫెయిల్యూర్ గా కనిపిస్తోంది. సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్, ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకత చూసి వైసిపి లోని ముఖ్య నేతలు అంతా ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. ప్రెస్ మీట్ లు పెట్టి ఈ వింత పేరును సమర్థిస్తే ప్రజల నుంచి వ్యతిరేకత తప్పదు అని భయపడ్డారు. అందుకే అంబటి రాంబాబు, కాసు మహేష్ రెడ్డి లాంటి ఒకరిద్దరు మాత్రమే దీనిపై మాట్లాడారు. మరోవైపు సజ్జల చుట్టూ ఆరోపణలు రావడం, ఆయన ఇటువంటి చచ్చు సలహాలు ఇస్తారని సొంతవారే అనుమానించడంతో మీడియా ముందుకు వచ్చారు. మావిగన్ అనేది ఎవరి సలహా కాదు అని.. అది జగన్మోహన్ రెడ్డి స్వయం నిర్ణయం అని సత్తి చెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు ఈ మావిగన్ సలహా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిది అని వైసిపి వర్గాలు భావిస్తున్నాయి. గత కొంతకాలంగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తాడేపల్లి ప్యాలెస్ లో కీలకం అవుతూ వస్తున్నారు. ఆయనే ఈ రాజధాని ప్రతిపాదనను నూరిపోసారని తెలుస్తోంది. అయితే ఇప్పుడు పార్టీకి డ్యామేజ్ జరుగుతుండడం.. స్వయంగా పార్టీ శ్రేణులే వ్యతిరేకిస్తుండడంతో సజ్జల దానిని రెట్టింపు చేయాలనుకున్నారు. అందుకే ఈ క్రెడిట్ మొత్తం జగన్మోహన్ రెడ్డి ఖాతాలో వేశారు. పరోక్షంగా తన ప్రమేయం లేదని సంకేతాలు ఇచ్చి.. ఇదంతా చేసింది చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అని అనుమానం రేగేలా మాట్లాడారు. ఇటీవల సజ్జల రామకృష్ణారెడ్డి ప్రాధాన్యతను తగ్గించాలని కొన్ని రకాల ప్రయత్నాలు జరుగుతున్నట్లు తాడేపల్లిలో టాక్ వినిపిస్తోంది. సజ్జలను పార్టీ నుంచి సాగనంపేందుకు వైసిపి లోని ఒక బలమైన వర్గం ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. వచ్చే రెండు మూడు నెలల్లో పార్టీలో సంచలనాత్మక మార్పులు ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది. కొందరు నేతలను జగన్మోహన్ రెడ్డి దూరం పెడతారని కూడా టాక్ నడుస్తోంది. చుట్టూ కోటరితో పార్టీకి డ్యామేజ్ జరుగుతోందని.. ఇలా అయితే పార్టీలో కొనసాగడం కష్టమని సీనియర్లు కొందరు అల్టిమేట్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో జగన్మోహన్ రెడ్డి సలహాదారులే పవర్ఫుల్. రాజశేఖర్ రెడ్డి సమకాలీకులు సైతం ఆ జిల్లాల వరకే ఉండేవారు. సలహాదారులు మాత్రం జగన్ తర్వాత అన్నట్టు పరిస్థితి ఉండేది. అయితే ఇప్పుడు ఆ సలహాదారుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఇదే అదునుగా సీనియర్లు జగన్మోహన్ రెడ్డికి తేల్చి చెబుతున్నారు. వారు పార్టీలో ఉంటే కొనసాగలేమని తేల్చి చెప్పినట్లు బయట ప్రచారం నడుస్తోంది. మొత్తానికి అయితే ఒకటి రెండు నెలల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సంచలనాలు నమోదయ్యే అవకాశం ఉంది.

# ఆపరేషన్ సింధూర్ 2.0

శ్రీనగర్, ఏప్రిల్ 7,

ఒకవైపు పశ్చిమాసియా యుద్ధం.. ఇంకోవైపు పాకిస్తాన్లో ఆర్థిక సంక్షోభం.. ఇంకోవైపు ఆఫ్ఘనిస్తాన్‌తో యుద్ధం.. మరోవైపు సౌదీ అరేబియా, చైనా బకాయిల ఒత్తిడి.. చివరకు అంతర్గతంగా ఖైబర్ ఫఖ్తూఖ్వా, బలూచిస్తాన్‌లో తిరిగుబాట్లతో మన దాయాది దేశం పాకిస్తాన్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. సౌదీ అరేబియా 6.3 బిలియన్ డాలర్ల రుణం తిరిగి చెల్లించాలని డిమాండ్ చేయడం, చైనా 220 మిలియన్ డాలర్ల బకాయిలు డిమాండ్ చేయడంతో ఒత్తిడి పెరిగింది. విదేశీ మారకాల రిజర్వులు 9 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో 38 శాతానికి చేరింది. మొత్తంగా పాకిస్తాన్ దివాళా తీసే పరిస్థితిలో ఉంది. దీనిని తమక అవకాశంగా మలుచుకోవాలని భారత్ భావిస్తోంది. ఉగ్రవాదాన్ని పోషిస్తూ భారత్ కంట్లో నలుసులా మారిన పాకిస్తాన్‌ను మరోసారి దెబ్బకొట్టేందుకు ఇదే అనువైన సమయమని భావిస్తోంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ త్రివిధ దళాధిపతులతో వరుస భేటీలు నిర్వహించడం, పాకిస్తాన్‌కు గట్టి వార్నింగ్ ఇవ్వడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తున్నాయి. 2025లో జరిగిన ఆపరేషన్ సింధూర్ తర్వాత, మరోసారి సైనిక చర్యకు సిద్ధమవుతోందా అనే చర్చ సాగుతోంది. పాకిస్తాన్ సైనిక సలహాదారులను బహిష్కరించడం, దౌత్య సంబంధాలు తెంచుకోవడం వంటి చర్యలు ఇందుకు నిదర్శనం. భారత్ అనేక రాష్ట్రాల్లో మాక్ డ్రిల్స్ నిర్వహిస్తోంది. పంజాబ్, రాజస్థాన్, గుజరాత్ సరిహద్దు ప్రాంతాల్లో ఈ అభ్యాసాలు జరుగుతున్నాయి. ప్రజలకు 3 నెలల రేషన్ సరఫరా చేయడం, యుద్ధం వస్తే ఇబ్బంది పడకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం గమనార్హం. ఇది యుద్ధ సిద్ధతలో భాగమేనా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 2025 మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్‌పై క్షిపణి దాడులు చేసింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతికారంగా 26 మంది పౌరుల హత్యకు బాధ్యులైన ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసింది. ఇప్పుడు ఆపరేషన్ సింధూర్ 2.0తో మరింత విస్తృత దాడులు చేయడానికి సిద్ధమవుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాకిస్తాన్ సైన్యాధ్యక్షుడు అసీఫ్ మునీర్, "భారత్ ప్రతీకార చర్యలకు దిగితే దీటుగా బదులిస్తామని" మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు. కానీ వాస్తవ పరిస్థితి వేరు. ఆర్థిక సంక్షోభం, అంతర్గత కలహాలు (బలూచిస్తాన్, ఖైబర్ పఖ్తూన్ఖ్వా), దౌత్య ఏకాంతం (విదేశీ ఎంబసీలు మూతపడటం)తో పాక్ సైనిక చర్యకు సిద్ధంగా లేదుభారత్ పాకిస్తాన్‌పై మరోసారి దాడి చేసే అవకాశం ఉంది. కానీ ఇది పూర్తిస్థాయి యుద్ధంగా మారదు. ఆపరేషన్ సిందూర్ 2.0 పేరిట ఉగ్రవాద స్థావరాలపై క్షిపణి దాడులు, ఎయిర్ స్ట్రైక్స్ జరిగే అవకాశం ఎక్కువ. పాక్ ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ ఒత్తిళ్లను అవకాశంగా మలుచుకుని, భారత్ తన సైనిక సామర్థ్యాన్ని చాటుకోవాలని భావిస్తోంది.

# 10 నుంచి భానుడి అసలైన భగభగలు

హైదరాబాద్, ఏప్రిల్ 7, (

రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఎండలు దంచనున్నట్లు వాతావరణ నిపుణులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈనెల 10 నుంచి భానుడి అసలైన భగభగలు ఉంటాయని అంచనా వేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో గరిష్ఠంగా 43 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని పేర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై భానుడు ఉగ్రరూపం చూపనున్నాడని.. ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఎండాకాలం మొదలైన తర్వాత ఆకస్మిక వర్షాలు కురుస్తుండటం చూస్తూనే ఉన్నాం. అదే సమయంలో భానుడి భగభగలు కూడా నమోదు అవుతున్నాయి. వడగండ్ల వానలతోపాటు.. ఎండలు కూడా భారీగానే ఉంటున్నాయి. ఈ క్రమంలోనే పూర్తి స్థాయి వేసవి కాలం.. ఏప్రిల్ 10వ తేదీ నుంచి ప్రారంభం అవుతుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. గత కొన్ని రోజులుగా అక్కడక్కడా వర్షాలు కురిసి వాతావరణం కాస్త ప్రశాంతంగా ఉన్నప్పటికీ.. ఏప్రిల్ 10వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోనున్నాయని హెచ్చరిస్తున్నారు. రానున్న 10 రోజుల్లో తెలంగాణలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 డిగ్రీల నుంచి 4 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాలపై భానుడి ప్రతాపం మరింత ఎక్కువగా ఉండనున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి కరీంనగర్, వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని ప్రజలు ఎండల పట్ల అలర్ట్‌గా ఉండాలని వాతావరణ నిపుణులు సూచిస్తున్నారు. మరీ ముఖ్యంగా సింగరేణి ప్రాంతాల్లో ఎండలు భీకరంగా ఉండనున్నాయని పేర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు కూడా 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇక హైదరాబాద్‌లో కూడా భానుడి ప్రభావం అధికంగానే ఉండనున్నట్లు తెలిపారు. హీట్ ఐలాండ్ ప్రభావంతో హైదరాబాద్‌లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును చేరుకోనున్నట్లు అంచనా వేస్తున్నారు. తీవ్రమైన వేడి కారణంగా స్థానికంగా ఏర్పడే అల్పపీడన ద్రోణుల కారణంగా.. అక్కడక్కడా ఉరుములతో కూడిన వడగళ్ల వానలు కూడా కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఆ వర్షాలు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తాయని.. భూమిలో వేడి పెరగడం వల్ల వర్షం పడిన తర్వాత మరింత ఉక్కపోత ఎక్కువయ్యే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. మరోవైపు.. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. కామారెడ్డి, ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలకు రైతులకు చేతికొచ్చిన తీవ్ర నష్టం వాటిల్లింది. మంగళవారం రోజున ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అంచనా వేసింది.

# "మేడే" కార్యక్రమం విజయవంతం చేయండి

**ప్రపంచ కార్మిక దినోత్సవం"మే డే"స్ఫూర్తితో కార్మిక వర్గ హక్కుల సాధన కోసం ఉద్యమించాలి.**

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురి జాల శ్రీధర్ పిలుపు.**

బోయిన్పల్లి :

ఈరోజు బోయిన్పల్లి మండలం మాన్వాడ గ్రామంలో హ మాలి కార్మికుల ఆధ్వర్యంలో మే 1న జరిగే ప్రపంచ కార్మిక దినోత్సవం 140,వ, "మే డే"కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయాలని ఈరోజు కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం కార్మిక వర్గం వెట్టి చాకిరి విముక్తి కోసం, కార్మికులకు కనీస హక్కులు ఉండాలని సాగించిన వీరోచిత పోరాటం ద్వారా కార్మిక వర్గానికి కొన్ని హక్కులు వచ్చాయని ఆ పోరాటంలో ఎంతో మంది రక్తం చిందించి ప్రాణాలర్పించడం జరిగిందని ఆ పోరాటంలో అమరులైనటువంటి వారి త్యాగాల గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి కార్మిక వర్గం, కష్టజీవులు అందరూ మే 1వ తేదీన కార్మికుల హక్కుల పోరాట దినోత్సవం "మే డే"కార్యక్రమానికి మండలంలో ఉన్న కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునివ్వడం జరుగుతుంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మిక వర్గం పోరాడి ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను పెట్టుబడిదారులకు, వ్యాపారవేత్తలకు అనుకూలంగా కార్మిక వర్గాన్ని మళ్లీ బానిసత్వంలోకి నెట్టే విధంగా కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మిక హక్కులను హరిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు ఇచ్చినటువంటి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత మరియు ఇతర హామీలను అమలు చేయకుండా కార్మిక వర్గానికి నష్టం చేసే విధానాలను రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ"మే డే"స్ఫూర్తితో కార్మిక వర్గం తమ హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునివ్వడం జరుగుతుంది. మే 1వ, తేదీన జరిగే మేడే దినోత్సవం బోయిన్పల్లి మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుంది కాబట్టి, మరి ఇక్కడ ఉన్న ఈ ప్రాంతం వ్యాపారస్తులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ తమ వంతు ఆర్థిక, సహాయ సహకారాలు అందించి"మే డే"కార్యక్రమాల విజయవంతంలో భాగస్వాములు కావాలని కార్మిక వర్గానికి బాసటగా నిలవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్ మరియు హ మాలీ సంఘం అధ్యక్షులు,ఎలాగాంధుల తిరుపతి, రామ్ రెడ్డి, బత్తిని కనకయ్య, కొంపల్లి పవన్, కొంపల్లి వెంకట్, బంధేలా వినోద్, ముత్తైయా, రామిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ స్కూల్స్ కు దీటుగా సర్కారీ స్కూల్ అడ్మిషన్ల కోసం ఎగబడిన పేరెంట్స్

నల్గొండ, ఏప్రిల్ 7,

ల్గొండ జిల్లా కేంద్రంలోని బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల కోసం తల్లిదండ్రులు ఎగబడుతున్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సొంత నిధులతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసిన ఈ పాఠశాలలో స్మార్ట్ క్లాసులు, ఏఐ బోధన, డిజిటల్ ల్యాబ్స్ వంటి అత్యాధునిక వసతులు ఉండటంతో ప్రైవేట్ స్కూళ్లను వదిలి ఇక్కడ చేర్పించేందుకు పిల్లల తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. సీట్లు పరిమితంగా ఉండటంతో అడ్మిషన్ల కోసం భారీగా రద్దీ నెలకొంది. ఉదయం నుంచే స్కూల్ గేటు మందు క్యూలైన్లలో వేచి ఉంటున్నారు. గవర్నమెంట్ స్కూల్స్ అంటే శిథిలావస్థలో ఉన్న భవనాలు, అరకొర వసతులు అనే ముద్ర ఇప్పటికీ ఉంది. ప్రస్తుత కాలంలో చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ స్కూళ్లలో చదివించేందుకు ఇష్టపడటం లేదు. అప్పు చేసైనా సరే.. ప్రైవేటు స్కూళ్లకు పంపించాలనే ఆలోచనలో తల్లిదండ్రులు ఉంటున్నారు. కానీ నల్గొండలోని ఓ గవర్నమెంట్ స్కూల్ మాత్రం అందుకు భిన్నం. బొట్టుగూడ కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పేరెంట్స్ అభిప్రాయాన్ని పూర్తిగా చెరిపివేసింది. ఈ స్కూల్‌లో అడ్మిషన్ కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. ప్రస్తుతం ఈ పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా.. ఒక సీటు సంపాదించడం కోసం తల్లిదండ్రులు పడుతున్న తాపత్రయం చూస్తుంటే కార్పొరేట్ స్కూళ్లు కూడా దిగదుడుపే అనిపిస్తోంది.




ఇవాళ తెల్లవారుజాము నుంచే స్కూల్ గేటు ముందు తల్లిదండ్రులు, విద్యార్థులు భారీ క్యూ లైన్లలో వేచి చూడటం ఇక్కడి విద్యా ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తన కుమారుడి జ్ఞాపకార్థం ఈ పాఠశాలను సొంత నిధులతో అత్యంత ఆధునికంగా తీర్చిదిద్దారు. కేవలం భవన నిర్మాణమే కాకుండా, విద్యాబోధనలో కూడా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఇక్కడ విద్యార్థులకు స్మార్ట్ క్లాస్ రూమ్‌లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత బోధన, అత్యాధునిక డిజిటల్ ల్యాబ్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయుల అనుభవజ్ఞులైన బోధనతో పాటు, అధునాతన సాంకేతికత తోడవడంతో విద్యార్థుల భవిష్యత్తుకు ఇక్కడ బలమైన పునాది పడుతోందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. చదువుతో పాటు విద్యార్థుల శారీరక దృఢత్వం కోసం విశాలమైన క్రీడా మైదానాన్ని కూడా ఏర్పాటు చేశారు. అలాగే, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడ చేర్పించేందుకు పోటీ పడుతున్నారు. నల్గొండ జిల్లా నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం ప్రభుత్వ పాఠశాల కాదని.... కార్పొరేట్ స్థాయికి దీటైన ఒక విశ్వవిద్యాలయంలా ఉందని క్యూలో నిలబడిన ఒక తండ్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సీట్లు పరిమితంగా ఉండటం, డిమాండ్ విపరీతంగా పెరగడంతో పాఠశాల యాజమాన్యానికి అడ్మిషన్ల నిర్వహణ పెద్ద సవాలుగా మారింది. మంత్రి విజన్, అధికారుల పర్యవేక్షణ, ఉపాధ్యాయుల కృషి వెరసి ఈ పాఠశాల నేడు ఒక కార్పొరేట్ స్కూల్‌గా నిలిచింది. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం పెంచడమే కాకుండా.. విద్యా విప్లవానికి నల్గొండలోని కోమటిరెడ్డి ప్రతీక్ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాక్షిగా నిలుస్తోందని విద్యావేత్తలు ప్రశంసిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను తలుచుకుంటే భయపడే రోజులు పోయి.. గర్వంగా చేర్పించే రోజులు వచ్చాయని అంటున్నారు.

==============================

# మేలో విస్తరణ పక్కా



హైదరాబాద్, ఏప్రిల్ 7,

తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అందరి దృష్టి కేబినెట్ విస్తరణ అంశంపైనే కేంద్రీకృతమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గంలో ఖాళీలను ఎప్పుడు భర్తీ చేస్తారు, ఎవరికి ఉద్వాసన పలుకుతారు అనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, పుదుచ్చేరి రాష్ట్రాల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుండటంతో ఈ కసరత్తు మే నెల వరకు వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధిష్టానం మొత్తం ఈ ఎన్నికలపైనే దృష్టి సారించడంతో తెలంగాణలో మార్పులకు ముహూర్తం ప్రస్తుతానికి దూరమైంది. అధిష్టానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు ప్రస్తుతం కేరళ సహా ఇతర రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. ఈ కీలక సమయంలో కేబినెట్ విస్తరణ చేపడితే పార్టీలో అంతర్గత విభేదాలు తలెత్తి ఎన్నికల వ్యూహాలపై ప్రభావం పడుతుందని హైకమాండ్ భావిస్తోంది. ఎన్నికల ప్రక్రియ ముగిసి ఫలితాలు వెలువడిన తర్వాతే తెలంగాణలో పూర్తిస్థాయి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని ముఖ్యమంత్రి స్వయంగా స్పష్టం చేయడంతో ఆశావహులు తమ ప్రయత్నాలను తాత్కాలికంగా నెమ్మదించారు. ఈసారి విస్తరణ కేవలం ఖాళీగా ఉన్న ఆరు స్థానాల భర్తీకే పరిమితం కాకుండా ఒక భారీ ప్రక్షాళన దిశగా సాగనుంది. మంత్రుల గత ఏడాది కాలం పనితీరుపై ముఖ్యమంత్రి ఇప్పటికే ఒక ప్రోగ్రెస్ రిపోర్ట్ సిద్ధం చేసినట్లు సమాచారం. శాఖల వారీగా సాధించిన పురోగతి, ప్రజల్లో ఉన్న వ్యతిరేకత, మంత్రులపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఇద్దరు లేదా ముగ్గురు పాత వారిని తప్పించే అవకాశం ఉంది. పనితీరు సరిగ్గా లేని వారి స్థానంలో కొత్త రక్తానికి అవకాశం ఇచ్చి పాలనలో వేగం పెంచాలని రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. సామాజిక సమీకరణాల పరంగా ఈ విడత విస్తరణలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఇప్పటివరకు మంత్రివర్గంలో తగిన ప్రాతినిధ్యం లేని బీసీ సామాజిక వర్గానికి అలాగే లంబాడా వర్గానికి కచ్చితంగా చోటు కల్పించనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచేలా ముఖ్యమంత్రి తన బృందాన్ని తీర్చిదిద్దుతున్నారు. మైనారిటీ కోటాలో మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ పేరు పరిశీలనలో ఉన్నప్పటికీ ఆయనకు మంత్రి పదవి దక్కుతుందా లేదా కీలక నామినేటెడ్ పదవితో సరిపెడతారా అనేది ఐదు రాష్ట్రాల ఫలితాల అనంతరం తేలనుంది. విస్తరణ వార్తలతో ఆశావహ ఎమ్మెల్యేల్లో టెన్షన్ పెరిగింది. సీనియర్ నేతలు రాజగోపాల్ రెడ్డి, శ్రీధర్ బాబు వంటి వారు తమ ప్రాధాన్యతలను కాపాడుకునే ప్రయత్నం చేస్తుండగా మరికొందరు కొత్తగా చోటు దక్కించుకోవడానికి ఢిల్లీ స్థాయిలో పైరవీలు ముమ్మరం చేశారు. తమ పదవులు ఊడుతాయన్న భయంతో కొందరు మంత్రులు అధిష్టానం పెద్దలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. ఇదే సమయంలో కీలక నామినేటెడ్ పదవుల భర్తీ కూడా ఉండటంతో పార్టీలో పదవుల వేట తీవ్రతరమైంది. తెలంగాణ కేబినెట్ మార్పులు జాతీయ రాజకీయాల ఫలితాలతో ముడిపడి ఉన్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించే సీట్ల ఆధారంగా అధిష్టానం ముఖ్యమంత్రికి ఇచ్చే స్వేచ్ఛ ఆధారపడి ఉంటుంది. మే నెలలో ఫలితాలు వచ్చిన వెంటనే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. అందుకే పాలనలో తనదైన ముద్ర వేసేలా సమర్థులైన వారితో కూడిన సరికొత్త రేవంత్ మార్క్ కేబినెట్ మే నెలలో రూపుదిద్దుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# 26 ఏళ్ల తరబడి ఒకేచోట...

నల్గొండ, ఏప్రిల్ 7, (

నల్లగొండ జిల్లా పోలీస్ శాఖలో కొందరు అధికారులు ఏళ్ల తరబడి పాగా వేశారు. ఇల్లరికం వచ్చిన అల్లుడి తరహాలో తిష్ట వేసి అధికారులతో అంటకాగుతూ అక్రమ దం దాలకు తెరలేపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒంటిమీద డ్రెస్ వేయకుండా విధులు నిర్వహించే ఉద్యోగులైన ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, విజిలె న్స్‌లో ఏళ్ల తరబడి కొందరు పాతుకపోయారు. ప్రతి అంశాన్ని ప్రభుత్వానికి, జిల్లా స్థాయి లో ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తారు. క్షేత్రస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికా రుల పనితీరుపైన ప్రభుత్వానికి రిపోర్ట్ చే యాల్సి ఉ ంటుంది. కానీ కొందరు అధికారులు తప్పు చేస్తే వారితో అంటకాగి నివేదిక లు పం పించకుండా ఏమీ తెలియనట్టుగా ఉంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఒంటి మీద ఖాకి డ్రెస్ లేకుండా ప్రత్యేక విభాగాల్లో విధులు నిర్వహిస్తూ ఏళ్ల తరబడి ఉన్న పరిచయాలను నెలవారీ వసూళ్లకు నిదర్శనంగా నిలుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖాకీ డ్రెస్ లేకుండా పనిచేసే కీలక విభాగాల్లో ఐదేళ్ల వరకు మాత్రమే విధులు నిర్వహించవచ్చు. ఐదేళ్లకు మించి తిష్ట వేయడం అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. అధికారుల్ని ప్రసన్నం చేసుకుంటూ రాజకీయ నాయకులు పైరవీలతో ఇక్కడే తిష్ట వేసినట్లు తెలుస్తుంది. కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి అధికారుల వరకు ఉన్నారని ఆ శాఖలోనే చర్చించుకుంటున్నారు. పిడిఎస్ బియ్యం, ఇసుక దందా అధిక వడ్డీ ఆశ చూపడం, పశువుల అక్రమ రవాణా, పేకాటలపై ప్రభుత్వానికి, జిల్లా అధికారులకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. అక్రమార్కులతో ఈ శాఖలో తిష్టవేసిన అధికారులు సన్నిహిత సంబంధాలు కొనసాగి స్తూ ఆర్థిక బంధాన్ని బలపరుచుకుంటున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు వచ్చిన కానిస్టే బుళ్లను నిఘా విభాగాల్లో తీసుకోకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ అవి కేవలం చెప్పుకుందుకే అనే విధంగా ఉన్నతాధికారుల తీరు ఉన్నట్లు తెలుస్తుంది. దేవరకొండ డివిజన్‌కు చెందిన ఒక కానిస్టేబుల్ గతంలో సస్పెండ్ అయినప్పటికీ అతడిని నిఘా విభాగంలో కొనసాగించడం గమనార్హం. అదే డివిజన్‌లో పనిచేస్తున్న మరో నిఘా విభాగానికి చెందిన అధికారి మద్యం తాగి బైక్ ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మరణించాడు. సస్పెన్షన్ ఉత్తర్వులు ఇచ్చిన అధికారులు.. సంబంధిత అధికారికి ఆర్డర్ కాపీ ఇవ్వకుండానే మధ్యలోనే నిలిపివేయ డం అంతర్గతంగా పెద్ద చర్చకు దారి తీసింది. అదే డివిజన్‌లో పనిచేస్తున్న ఓ పోలీసు అధికారి పశు వుల అక్రమ రవాణాల్లో పట్టుబ డిన వారి నుంచి సదరు పోలీసు అధికారి ఫోన్ పే ద్వారా డబ్బులు తీసుకోగా ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తానని చెప్పడంతో డబ్బులు తీసుకున్న అధికారి నిఘా విభాగం అధికారికి నగదు ఇచ్చినట్లు తెలిసింది. నల్లగొండ డివిజన్‌లో జాతీయ రహదారి సమీపంలోని ఒక పోలీస్ స్టేషన్ వద్ద ఏపీ నుంచి హైదరాబాద్‌కి వెళ్తున్న పశువుల అక్రమ రవాణాపై పోలీస్ తరహాలో కేసులు పెట్టి పట్టుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే అందులోని కొన్ని పశువులను మాత్రమే గోశాలకు తరలించగా పట్టుకున్న పశువులకి, గోశాలకు తరలించిన వాటికి మధ్యన లెక్క పొంతనలేదని పెద్ద ఎత్తున చర్చ జరిగింది. అలాగే రెండు ఇసుక లారీలను పట్టుకొని ఒక లారీ ఓనర్ వద్ద డబ్బులు తీసుకొని వదిలేసినట్లు తెలుస్తుం ది. ఇలాంటి నివేదికలు ఇవ్వకుండా డివిజన్ స్థాయిలో ఉన్నతాధికారి నిఘా విభాగం అధికారులను ప్రభావితం చేస్తున్నారని ఆ శాఖ నుండే వినిపిస్తుంది. ఒక పోలీస్ అధికారి వేధింపులతో ఓ వ్యక్తి ఆత్మహత్య ప్రయ త్నం చేయగా దేవరకొండ డివిజన్‌లో ప్రభు త్వ ఆసుపత్రిలో చికిత్స పొందగా ఈ సంఘటనకు సంబంధించిన విషయం బయటకు తెలియకుండా సంబంధిత అధికారి డబ్బులిచ్చి రాజీ చేసుకున్న విషయం బహిరంగ రహస్యమే. పోలీస్ స్టేషన్‌లో రైటర్లుగా కొనసాగుతూ వచ్చిన ప్రతి అధికారిని ప్రస న్నం చేసుకుంటూ ఆర్థిక ప్రయోజనాలను చక్కదిద్దుతూ ఏళ్ల తరబడి డిప్యూటేషన్ పేరిట కొనసాగడం చర్చనీయాంశంగా మారుతుంది. వీళ్లు లేకపోతే స్టేషన్ నిర్వహణ కష్టమని స్టేషన్ అధికారులతో ఉన్నత అధికారులకు చెప్పించడం, రాజకీయ పలుకుబడి ఉ పయోగించడంతో గత 15 నుంచి- 20 ఏళ్ల వరకు ఇక్కడే తిష్ట వేశారు. వారే కుటుం బ సభ్యులతో రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలను నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లా కేంద్రంలో ఒంటిమీద ఖాకీ డ్రెస్ లేకుండా పనిచేసే ఒక అధికారిపై అతని ఇంటి వద్దనే ఓ మహిళ భర్త బంధువులు దేహశుద్ధి చేయ గా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో చికిత్స పొం దిన విషయం హాట్ టాపిక్‌గా మారిం ది. అతని వ్యవహార శైలి తెలిసిన ఉన్నత అధికారులు కూడా ఏమీ తెలియనట్టుగా ఉండి అక్క డే కొనసాగించడంలో ఆర్థిక బంధం బలంగా ఉందని గుసగుసలు స్థానికంగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో ఎస్సైగా పనిచేసిన అధికారి సర్కిల్, డివిజన్ స్థాయి అధికారిగా ఇదే జిల్లాలో పనిచేస్తూ అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. తన సామాజిక వర్గానికి చెందిన అధికారులను వెనుకేసుకురావడం, అక్రమాలకు సహకరించని కిందిస్థాయి అధికారులపై రాజకీయ నాయకుల వద్ద ఇతనితో ప్రయోజనం లేదుంటూ చెప్పి అతని పోస్టింగ్ మార్పించడంలో దిట్ట అని ఆ శాఖలో చర్చించుకుంటు న్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో సంబంధాలు ఉన్నాయంటూ ఆ శాఖలో కీలక అధికారిని సైతం ఖాతర్ చేయడం లేదని తెలుస్తోంది.

# తెలంగాణలో హెల్త్ ఏటీఎంలు

హైదరాబాద్, ఏప్రిల్ 7,

తెలంగాణ ప్రజలకు రేవంత్ సర్కార్ శుభవార్త తెలిపింది. ఆరోగ్య సేవలను మెరుగపర్చేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక సదుపాయాలు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా టెక్నాలజీతో కూడుకున్న హెల్త్ ఏటీఎంలను తీసుకురావాలని యోచిస్తోంది. ఇప్పటికే పైలట్ ప్రాజెక్టుగా కొన్ని ఆస్పత్రుల్లో తీసుకురాగా.. ఇవి విజయవంతమయ్యాయి. దీంతో మరిన్ని ఆస్పత్రుల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఔట్ పేషెంట్లు ఎక్కువగా ఉండే హాస్పిటల్స్‌లో వీటిని నెలకొల్పనుంది. హెల్త్ ఏటీఎంలుగా పిలుస్తున్న ర్యాపిడ్ డయాగ్నస్టిక్ టెస్టింగ్ మెషీన్లను త్వరలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం కింగ్ కోఠి జిల్లా హాస్పిటల్, మలక్ పేట్ ఏరియా ఆస్పత్రుల్లో హెల్త్ ఏటీఎంలను ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మకంగా వీటిని ఏర్పాటు చేసి పరీక్షించారు. ఇవి పూర్తిగా విజయవంతం అయ్యాయి. రోగ నిర్ధారణలో ఇవి ఖచ్చితత్వాన్ని చూపిస్తున్నాయి. ఈ హెల్త్ ఏటీఎంలలో పరీక్షలు చేయించుకున్న రోగుల నమూనాలను టీ డయాగ్నోస్టిక్ కేంద్రాలకు పంపారు. ఇక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్లలో కూడా పరీక్షలు నిర్వహించారు. హెల్త్ ఏటీఎంలలో వచ్చిన రిజల్ట్స్.. వీటిల్లోనే అలాగే వచ్చాయి. ఫలితాలు సరిపోవడంతో హెల్త్ ఏటీఎంల పనితీరు బాగుందనే అంచనా అధికారులు వచ్చారు. దీంతో మరిన్ని ప్రభుత్వ దవాఖానాల్లో వీటిని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. ఇప్పటికే వీటిపై ప్రభుత్వానికి ఒక నివేదికను అధికారులు సమర్పించారు. రోగుల రద్దీ ఎక్కువగా ఉంటే హాస్పిటల్స్‌లో వీటిని ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సేవలు వేగంగా అందించవచ్చుఈ హెల్త్ ఏటీఎంలు కొన్ని నిమిషాల వ్యవధిలోనే 132 రకాల టెస్టులు ఆటోమేటిక్‌గా చేస్తాయి. డాక్టర్‌తో సంబంధం లేకుండా ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు అన్నీ పూర్తి చేస్తాయి. అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ వైద్య




పరికాలతో పనిచేసే ఈ ఏటీఎంలు.. రోగి బాడీని స్కాన్ చేసి బీపీ, రక్తంలో ఆక్సిజన్ స్థాయి. బరువు, ఎత్తు, బాడీ టెంపరేచర్ వంటి వాటిని వేగంగా కొలుస్తాయి. ఇక డెంగ్యూ, మలేరియా. యూరిన్, కొలెస్ట్రాల్, ఈసీజీ, షుగర్, హెచ్‌ఔడీ వంటి ర్యాపిడ్ టెస్టులు వేగంగా చేస్తాయి. ఇక రోగి డిజిటల్ హెల్త్ రికార్డ్ తయారుచేసి భద్రపరుస్తుంది. ఇక టెస్టులు పూర్తయిన తర్వాత దీని ద్వారానే డాక్టర్‌తో మాట్లాడుకోవచ్చు. ఓ ప్రైవేట్ సంస్థ ఈ యంత్రాలను అభివృద్ధి చేయగా.. రెండు నెలల పాటు పరీక్షించారు. వీటి వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో వేగంగా రోగులకు సేవలు అందుతున్నాయి. డాక్టర్ల కోసం వెయిట్ చేసే పని తప్పుతుంది. ఇలా వీటి వల్ల అనేక లాభాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

================

# గడువులోగా వినతులు పరిష్కరించాలి.

విశాఖపట్నం ఏప్రిల్ 7,

ప్రజా దర్బార్ కి వచ్చిన వినతుల పరిష్కారంలో సిబ్బంది జవాబుదారీగా ఉండాలని, నిర్దేశించిన గడువులోగా బాధితులకు సరైన సమాచారం ఇవ్వాలని, వారి సమస్యకి తగిన పరిష్కారం చూపాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. సోమవారం ఉదయం వి ఎం ఆర్ డి ఎ కార్యాలయం 3 వ అంతస్తు సమావేశమందిరంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకొని సంబంధిత అధికారులతో ఆయా సమస్య పై చర్చించారు. వాటి పరిష్కారానికి చొరవ చూపాలని, పదే,పదే కార్యాలయానికి తిప్పవద్దని సూచించారు. గడువులోగా బాధితులకు వాటి వినతుల విషయమై మన విభాగం ద్వారా తీసుకున్న చర్యల గురించి వివరించాలని కోరారు. ప్రజా దర్బార్ కి మొత్తం 5 వినతులు రాగా, వాటిలో ప్లానింగ్ కి 2, ఎస్టేట్ కి 1, పరిపాలన విభాగానికి మిగిలిన వినతులు వచ్చాయి. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కే రమేష్, ఇతర విభాగ అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు

## భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు

భద్రాద్రి ఏప్రిల్ 7,

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రకటించిన అవార్డుల్లో గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం విశిష్ట స్థానం సంపాదించింది. జిల్లా డీసీహెచ్ఎస్ డా. రవి బాబు పరిధిలోని వైద్య విధాన పరిషత్ (టీవీఎవీపీ) ఆసుపత్రులు అత్యధిక అవార్డులు సాధించడం విశేషం. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఈ రోజు అవార్డుల ప్రదానం హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా, కమిషనర్ ఫ్యామిలీ ఒ హెల్త్ సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మరియు ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు విభాగాధిపతులు పాల్గొన్నారు. ఈ అవార్డులు అందుకున్న వారిలో సిహెచ్సి పాల్వంచకు చెందిన డా. శైలేష్ కుమార్ (సిఏఎస్ -ఆర్థో), డా. పి. రామ్ ప్రసాద్ (డిప్యూటీ వైస్ అనస్తీషియా), ఏరియా హాస్పిటల్ భద్రాచలం నుంచి డా. క్రపా విజయ్ (డిప్యూటీ వైస్ -పెడియాట్రిక్స్), నర్సింగ్ ఆఫీసర్ కృష్ణవేణి, అబస్ సేవలలో ఎ. వెంకట రావు (98), అలాగే ల్యాబ్ సేవల విభాగంలో భద్రాచలం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ కృష్ణ ఉన్నారు. ఏరియా హాస్పిటల్ మనుగూరు నుంచి నర్సింగ్ ఆఫీసర్ మానస , సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ గ్రేడ్?ఎ ఏ. శారధ అవార్డులు అందుకున్నారు. అదనంగా భద్రాచలం, మనుగూరు, చర్ల వంటి గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డీ సి హెచ్ ఎస్ డాక్టర్ జి రవి బాబు మూడు అవార్డులు ఆయా సూపరింటెండెంట్లు అయిన రామ కృష్ణ,గౌరీప్రసాద్, సాయి వర్ధన్ లతో కలిసి అందుకున్నారు.

# ఫలించిన 29వ డివిజన్ కార్పొరేటర్ సాగర్ కృషి

# ఎంపీ రవిచంద్ర చొరవతో రెండు బోర్లు మంజూరు

## 3 లక్షల వ్యయంతో వేసిన రెండు బోర్లు

కొత్తగూడెం ఏప్రిల్ 7,

వేసవికాలంలో కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్లోని ప్రజలకు మంచినీటి ఎద్దడి రాకుండా చూసేందుకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర చొరవు తో రెండు బోర్లు మంజూరు చేసినట్లు ఆ డివిజన్ కార్పొరేటర్ సాగర్ వెల్లడించారు. డివిజన్ లోని ప్రగతి నగర్ ఏరియా లోగల మానస వికాస్ పాఠశాల ముందు లైన్ లో ఒకటి, గొల్లగూడెం ప్రాంతంలో మరొకటి బోర్లు వేయడం జరిగింది. గొల్లగూడెం ప్రాంతంలోని ప్రజలకు మంచినీటి ఎద్దడి లేకుండా చేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. బిఆర్ఎస్ పార్టీ ఎంపీ వద్దీరాజు రవిచంద్ర చొరవతో సుమారు రు. 3 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. కాగా 29వ డివిజన్ కార్పొరేటర్ "మల్హోత్రా సాగర్ డివిజన్ పరిధిలో 200 అడుగుల రెండవ బోర్ వేయించడం జరిగినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా"కార్పొరేటర్ మల్హోత్రా సాగర్ మాట్లాడుతూ, తాను ఇచ్చిన మాట, హామీలను అమలు చేయడం లో బిఆర్ఎస్ ఎంపీ వద్దీరాజు రవిచంద్ర సహాయం, తోడ్పాటు చాలా గొప్పది అని కొనియాడారు. అధిక సంఖ్యలో పాల్గొన్న డివిజన్ ప్రగతి నగర్ మహిళలు గత 5 సంవత్సరాలుగా నీటి కొరత ,ఇబ్బందులను తీర్చడం తో మల్హోత్ సాగర్ పాత్ర అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పెద్దలు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కరాటే శ్రీనివాస్ యాదవ్ , పార్టీ కార్యకర్తలు కన్నా ,శ్రీకాంత్, మల్హోత్రా కుమార్,సాగంటి రవి, కల్లుగడ్డ సురేష్,వేముల పవన్, చింతల రాము, బండి శివ,బండి అశోక్, రియాజ్ (అబ్బా) మహమ్మద్ షాను,ముతంగి యాదగిరి,సందరబోయిన శ్రీను,జి.శరత్,జి.నాగరాజు, బంటి, లేతాకుల నాగరాజు, లగిశెట్టి ప్రసాద్, గుడిసె శ్రావణ్, షేక్ అల్తాఫ్ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# వయోవృద్ధులు పోషణ సంరక్షణ చట్టం అమలుకుప్రత్యేక అధికారిని నియమించాలి

అమ్మానాన్నలకు అండగా బిడ్డల అనాధరణకు గురై భారంగా బతుకులీడుస్తున్న అసహాయ అమ్మానాన్నలకు ఆర్థిక భద్రత కల్పించే కీలక శాసనాన్ని తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. ఈ చట్టం ప్రకారం జన్మనిచ్చిన వారు బాగోగులు పట్టని సర్కారీ ప్రైవేటు ఉద్యోగుల జీతాల నుండి 15 శాతం లేదా 10 వేల రూపాయలు మినహాయించి తల్లితండ్రుల అకౌంట్లో జమచేస్తారు. కుటుంబ సమాజ అభివృద్ధికి పాటుపడిన తల్లితండ్రులకు మలివయసులో(వృద్ధాప్యంలో) ఎవరికి కాకుండా పోతున్న అభాగ్యుల కోసం తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత రెడ్డిగారిని అభిందిస్తూ రాసిన ఆర్టికల్ )



నేదునూరి కనకయ్య రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకానమిక్ ఫోరం

కొడుకుల 'బిడ్డల నిరాదరణకు గురౌతున్న వారి కోసం కేంద్ర ప్రభుత్వం 2007 లో తల్లి తండ్రుల వయోవృద్ధుల పోషణ' సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చింది. ప్రతి డివిజన్ స్థాయిలో ఒక ట్రిబ్యునల్ కమిటీ ఏర్పాటుచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వృద్ధుల సమస్యల పరిష్కారం' సంక్షేమం 'హక్కుల రక్షణ కొరకు నియమావళిని రూపొందించారు. కమిటీకి "ఛైర్మెన్ గా" రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి వ్యవహరిస్తారు జిల్లా వికలాంగుల సహాయ సంచాలకులు 'వయోవృద్ధులు శాఖ సహాయ సంచాలకులు కన్వీనర్లుగా స్వచ్ఛంద సంస్థల నుండి ఒకరు లేదా ఇద్దరు ప్రతినిధులు వుంటారు .ఈ కమిటీకి కోర్టుకు వుండే అధికారాలు వుంటాయి. కమిటీ తల్లి తండ్రుల కేసులు విచారించి 90 రోజుల్లో తీర్పులు ఇస్తాయి. కాని క్షేత్ర స్థాయిలో వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం ఆశించిన విధంగా జరగడం లేదు. రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారి తన రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం వల్ల సమయం లేక పోవడం వల్ల వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోని స్థితి. దాపురించింది. రాష్ట్రంలో వృద్ధులను బెదిరించి వారి ఆస్తులను తమ పేరు మీద రాయించుకోవడం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఒంటరి వృద్ధులు ఆస్తులు కోల్పోయి బజారున పడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య పింఛన్లు ఒంటరి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పలు పథకాలు ప్రవేశ పెట్టడం అభినందనీయం కానీ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరక్షరాస్యులైన వయోవృద్ధుల సంక్షేమం వారి హక్కుల రక్షణకు సమగ్రమైన చర్యలు చేపట్టాలి.

వయోవృద్ధుల ఆస్తులు రాయించుకొని వారిని ఇంటి నుండి బైటకు గెంటి వేస్తున్నారు. వృద్ధా శ్రమల్లో చేర్పిస్తు న్నారు. బలవంతంగా వృద్ధుల చేత ఆస్తులు రాయించుకున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆస్తి విక్రయానికి సంబంధించిన సొమ్ము వృద్ధుని ఖాతాలో జమ ఆయినా విషయం రూడి చేసుకుని అధికారులు తగు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వృద్ధులు నిరక్షరాస్యులు వారికి బ్యాంక్ ఖాతాలు ఉండవు. డివిజన్ స్థాయి అధికారులు తమ రెగ్యులర్ ఉద్యోగ బాధ్యతల్లో తీరిక లేకుండా వుండం వల్ల.వయోవృద్ధుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు.

మండల స్థాయిలో సీనియర్ సిటిజన్స్ చట్టం అమలుకుప్రత్యేక అధికారిని నియమించాలి.

ప్రభుత్వం ప్రతి మండల స్థాయిలో వయోవృద్ధులు సమస్యలు పరిష్కారం సంక్షేమం హక్కుల రక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలి.

గ్రామసభ ' సీనియర్ సిటిజన్స్ చట్టం పట్ల అవగాహన కల్పించాలి

గ్రామ పంచాయితీ కార్యదర్శి గ్రామంలోని వృదుల సంఖ్య పై సర్వే నిర్వహించాలి.

గ్రామసభలో వయోవృద్ధుల పోషణ 'సంక్షేమం 'హక్కుల రక్షణ' సీనియర్ సిటిజన్స్ చట్టం పట్ల అవగాహన చైతన్యం కలిగించాలి.వృద్ధుల ఆరోగ్యం సంక్షేమం అభివృద్ధి పథకాల మీధచర్చ జరగాలి. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి వయోవృద్ధుల జనాభా సేకరించి ప్రతి నెల వృద్ధుల కొరకు ఉచిత విధ్య ఆరోగ్య శిబిరంనిర్వహించాలి. ప్రతి గ్రామములో మహిళా సంఘాలు 'తల్లుల కమిటీలు మాదిరి వయోవృద్ధుల కమిటీ ఏర్పాటు చేయాలి. వయోవృద్ధులు సంక్షేమం కమిటీలుగా ఏర్పడాలి.

సీనియర్ సిటిజన్స్‌బి చట్టాలు బిమీడియా ప్రచారం చెయ్యాలి

కేంద్రం వయోవృద్ధులు సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన టోల్ ఫ్రీ నెంబర్14567 మీధ విస్తృత ప్రచారం చెయ్యాలి .మీడియా 'ప్రసార మాధ్యమాలు 'ఎలక్ట్రానిక్ మీడియా క్రియా శీల పాత్ర పోషించాలి.కేంద్ర ప్రభుత్వం 2007 లో ప్రవేశ పెట్టిన తల్లి తండ్రుల వయోవృద్ధులు పోషణ సంక్షేమం సంరక్షణ చట్టం మీధ వృద్ధులకు అవగాహన చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి.

గ్రామాల్లో వయో వృద్ధులను బెధిరించి ఆస్తిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై 1977 చట్టాన్ని అమలు చేసి కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు జరిమానాలు విధించి తిరిగి వయోవృద్ధుల ఆస్తిని వారి పేరు మీద రిజిస్టర్ చెయ్యాలి.

సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొనే సమస్యలు జిల్లా కలెక్టర్ రెవెన్యూ డివిజన్ అధికార్లకు నివేదించాలి. వృద్ధులను మానవ వనరుల అభివృద్ధికి సారథులుగా సమాజం ప్రభుత్వం గుర్తించాలి.

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు
తెలంగాణ ఎకనామిక్ ఫోరం
మాజీ కరెస్పాండెంట్ జస్టిస్ కుమారయ్య లా కాలేజీ
కరీంనగర్
గ్రామం ' కల్లెపల్లి 'మండలం' బెజ్జంకి
జిల్లా' సిద్దిపేట 9440245771

# ధర్మపురి మండల అంబేద్కర్ కమిటీ అధ్యక్షుడిగా అరికిల్ల సతీష్

జగిత్యాల, ఏప్రిల్ 07( భారత శక్తి ప్రతినిధి ):



ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణ లో రెండవ సారి ధర్మపురి మండల అంబేద్కర్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ధర్మపురి మండల కమిటీ అధ్యక్షులుగా అరికిల్ల సతీష్, ఉపాధ్యక్షులు ముడిమడుగు శంకర్, ప్రధానకార్యదర్శి కుమ్మరి నవీన్, సహాయ కార్యదర్శి అల్లూరి పవన్ కుమార్, కోశాధికారి గా బరిగల ప్రశాంత్, ప్రచార కార్యదర్శి సిగిరి దాసు లతో పాటు గౌరవ అధ్యక్షులుగా పారాపెల్లి రాజమల్లయ్య, రాగుల కాంతయ్య వేలుగురి రాజన్న,11 మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇట్టి కార్యక్రమం లో ముఖ్య అతిధులు గా చిలుముల లక్ష్మన్ (నాగారం సర్పంచ్), దాసరి పురుషోత్తం (దోనూర్ సర్పంచ్), మాజీ కౌన్సిలర్ తరాల కార్తీక్, మాజీ మండల అధ్యక్షులు దొనకొండ నరేష్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు నేతకానీ సంఘము దుర్గం రవీందర్ నేతకానీ, ఆవునిరి శ్రీకాంత్,జంజీరికాని భరత్,టెంపుల్ మాజీ డైరెక్టర్ బొల్లారపు పోచయ్య, ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు చందోలి శ్రీనివాస్,పట్టణ అధ్యక్షులు పులి ప్రేమిత్, బత్తిని నరేష్,ఉపారపు రాజానర్సు, సుద్దాల నరేష్,ఆరెపల్లి ప్రశాంత్,దాసరి విజయ్ వీరితో పాటు మండల దళిత సంఘాల నాయకులు పాల్గొని ఈనెల 14 వ తేదిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 జయంతిని విజవంతం చెయ్యాలని కోరారు.

# సురక్షితమైనటువంటి ఆహారాన్ని స్వీకరించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి: డా.నవీన్, ఏ జి పి డి. శ్రీధర్ రెడ్డి, సి.హెచ్.స్వరూప రాణి న్యాయవాది

మెదక్, ఏప్రిల్ 07 (భారత శక్తి న్యూస్): అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ చైర్మన్ ఎం. హేమలత, నేతృత్వంతో నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జూనియర్ సివిల్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ డి. శ్రీధర్ రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నవీన్, లీగల్ సర్వీస్ న్యాయవాది సి. హెచ్. స్వరూప రాణి, లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరూ పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని, ముఖ్యంగా సురక్షితవైనటువంటి ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి అన్నారు. నేటి సమాజంలో కొంతమంది వ్యక్తులు దురాలవాట్లకు పాల్పడి వాళ్ళ ఆరోగ్యాన్ని పూర్తిగా క్షిణింప చేసుకొని సరైన సమయంలో వైద్యం చేయించుకోక ప్రాణాలు కోల్పోతున్నారని, ఏదైనా అనారోగ్యానికి గురైనప్పుడు తప్పనిసరి ఆసుపత్రిని సందర్శించి సరైనటువంటి చికిత్సను పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అన్నారు.ఆరోగ్యం పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలుషితమైనటువంటి




ఆహార పదార్థాలు స్వీకరించవద్దని తద్వారా ప్రాణాంతక రోగాల బారిన పడవద్దని, రోజువారీగా శారీరక వ్యాయామం, సురక్షితవైనటువంటి ఆహారం, శ్రేష్టవైన పండ్లు, కాలానుగుణంగా దొరికే శ్రేష్టమైన పండ్లు ఫలాలను తీసుకుని ఆరోగ్యవంతమైనటువంటి జీవితాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సహాయ న్యాయవాది తో పాటు, డాక్టర్ నవీన్, సి. హెచ్. స్వరూప రాణి, న్యాయవాది బేగ్, న్యాయవాది నవరతన్, లీగల్ సర్వీస్ సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు,రోగులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయిలో ఎంపికైన రాధికా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థి




మణుగూరు, ఏప్రిల్ 07 (భారతశక్తి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జిఎఫ్) బ్యాడ్మింటన్ పోటీలకు రాధికా కాన్సెప్ట్ స్కూల్ టెన్త్ క్లాస్ విద్యార్థిని కల్కి అశోక శివాని జాతీయ స్థాయిలో ఎంపికైందని పాఠశాల చైర్మన్ గంగిరెడ్డి మధుసూదన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని రాజీవ్ గాంధీ నగర్ లో గల రాధిక కాన్సెప్ట్ స్కూల్ ఆవరణలో విద్యార్థినిని పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ సంధర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి కఠిన సాధనతో జాతీయస్థాయికి ఎంపిక కావడం పట్ల ఆమె పట్టుదల, కృషి, నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ గొప్ప విజయానికి పాఠశాల యాజమాన్యం విద్యార్థినికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందు ఉండాలని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ మెరుగుపడుతుందని తెలిపారు. ఇదే పాఠశాల నుండి ఈ సంవత్సరం జాతీయస్థాయిలో (ఎస్జిఎఫ్) హాకీ పోటీలో పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మరింత కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు జయసింహారెడ్డి, సంపత్ రెడ్డి, పగడాల సతీష్ రెడ్డి, బద్దం శ్రీనివాస్ రెడ్డి, నూకారపు రమేష్, పాఠశాల ప్రిన్సిపల్ ఎమ్.నరేష్, కో-ఆర్డినేటర్లు ఉషా, కీర్తి, పిఈటిలు నరేందర్, చంద్రకళ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి.

## -పులుసు బొంత ప్రాజెక్టును నిర్మించి సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలి

## -జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ



మణుగూరు, ఏప్రిల్ 07 (భారతశక్తి): ఈ నెల 23,24,25 తేదీల్లోని కొత్తగూడెం పట్టణంలో జరిగే తెలంగాణ రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక శ్రామిక భవన్లో జరిగిన తెలంగాణ రైతు సంఘం మండల మహాసభలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మణుగూరు ప్రాంతంలో సుమారు 20వేల ఎకరాలు సేద్యంలోకి రావడానికి ఉపయోగపడే పులుసు బొంత ప్రాజెక్టును తక్షణమే నిర్మించి సీతారామ ప్రాజెక్టుకు అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు దేశవ్యాప్తంగా వ్యవసాయానికి ఎదురవుతున్న సవాళ్లపైన మూడవ రాష్ట్ర మహాసభల్లో కూలంకషంగా చర్చించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా కమిటీ సత్రపల్లి సాంబశివరావు, కేవీపీఎస్ నాయకులు కొడిశాల రాములు, పిట్టల నాగమణి, దామల్ల లెనిన్ బాబు, బొల్లం రాజు , సంకినేని వెంకట్రావు, ఉప్పతల నరసింహారావు, పల్లపు నాగేశ్వరరావు, సున్నం మల్లేష్, రైతు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక అగ్నిమాపక భద్రత తనిఖీలు: జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.నాగేశ్వరరావు

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 07:



తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం ఆధ్వర్యంలో జిల్లాలోని పరిశ్రమలు, నివాస, విద్యా, వాణిజ్య మరియు ఇతర సంస్థలలో అగ్నిమాపక భద్రత ప్రమాణాల అమలు పై ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి నాగేశ్వరరావు తెలిపారు.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ప్రతి వారం ముందస్తు సమాచారం ఇచ్చి సంబంధిత యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి, నేషనల్ బిల్డింగ్ కోడ్ ప్రకారం అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, నిర్వహణ, సక్రమ పనితీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నామని తెలిపారు.అందులో భాగంగా మంగళవారం పటాన్‌చెరు స్టేషన్ అగ్నిమాపక అధికారితో కలిసి పటాన్చెరు,ఐడీఏ పశామైలారం లోని ఎం/ఎస్ న్యూల్యాండ్ లాబొరేటరీస్ లిమిటెడ్, యూనిట్-××, ఎం/ఎస్ క్రామ్సన్ రీసెర్చ్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు.తనిఖీల సందర్భంగా సంబంధిత సంస్థల సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలు, భద్రతా ప్రమాణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.సంబంధిత సంస్థలు నేషనల్ బిల్డింగ్ కోడ్‌కు అనుగుణంగా అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసినట్లు గమనించామని, అయితే కొన్ని పరికరాలు పనిచేయకపోవడం, సరైన నిర్వహణ లేకపోవడం వంటి లోపాలు గుర్తించి, అట్టి లోపాలను వెంటనే సరిదిద్దాలని, అన్ని పరికరాలు ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని యాజమాన్యాలను ఆదేశించామనితెలిపారు. అదేవిధంగా, అగ్నిమాపక భద్రత ప్రమాణాలు పూర్తి స్థాయిలో అమలు చేసిన తర్వాత అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం ఫైర్ విభాగాన్ని సంప్రదించాలనిసూచించారు.పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు అగ్నిమాపక భద్రత పట్ల అవగాహన పెంచడం, ప్రాణాలు, ఆస్తులు మరియు మౌలిక సదుపాయాలను రక్షించడం ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు.జిల్లాలో అగ్నిమాపక భద్రత నియమాలు కచ్చితంగా అమలవుతున్నాయో లేదో నిర్ధారించేందుకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన తెలిపారు.

# విద్యుత్ ఉద్యోగుల చలో వరంగల్ – ధర్నాకు భారీగా తరలి వెల్లిన సంగారెడ్డి విద్యుత్ ఉద్యోగులు

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 7:

విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం హన్మకొండలోని టిజిఎల్పిడి సిఎల్ ప్రధాన కార్యాలయం వద్ద మంగళవారం మహా ధర్నా నిర్వహించారు. ఉద్యోగ భద్రత, జీతాల



పెంపు,రెగ్యులేషన్ డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా నుండి విద్యుత్ ఉద్యోగులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. తమ న్యాయమైన కోరికలు తీర్చాలని జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా మరియు నిరసన చేశారు. భారీ సంఖ్యలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలి: మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 7:ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పోసిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు చూసుకోవాలని రైతులు సైతం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కేంద్రానికి తీసుకువచ్చి నిర్వాహకులకు సహకరించాలని సూర్యాపేట మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్యాది అన్నారు.మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 10వ వార్డు కుప్పిరెడ్డి గూడెంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మేప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి రెడ్డి తో,ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర అందించాలి, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వైస్సార్, ఆర్డీఆర్ ర్ల ఆలోచన మేరకు ప్రతీ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు 500 బోనస్ అందిస్తున్నట్లు గుర్తు చేశారు. రైతులకు ఉచిత కరెంట్, రుణ మాఫీ, రైతు భరోసా, 500 బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని అన్నారు.ఈ సందర్భంగా ఎసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను



ప్రోత్సహిస్తుందని అన్నారు. దీనివల్ల మన రైతుల వద్దనే సన్నాలు కొని మళ్ళీ మనకే సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అవ్వాలని సూచించారు.తేమ 17 శాతం ఉండాలని, బస్తా 41 కేజీలు మాత్రమే తూకం వేయాలని ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యండి అంజద్ అలి, సూర్యాపేట మండల పార్టీ అధ్యక్షుడు కోతి గోపాల్ రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు వెక్కంటి శేఖర్ రెడ్డి, కొండపల్లి దిలీప్ రెడ్డి, గుణగంటి హేమ సతీష్, శ్రీ దండు మైసమ్మ తల్లి దేవస్థానం చైర్మన్ తంగేళ్ళ కరుణాకర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, చెంచల నిఖిల్, వెక్కంటి వెంకట్ రెడ్డి, కనుకు వెంకన్న, ఆదిమల్ల కృష్ణ, కనుకు రేణుక, శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మందాడి వెంకట్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియను నిర్వహించాలి

## -ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా నిర్వహించాలిలి
## -జిల్లాలో వేసవిలో త్రాగునీరు ఎద్దడి లేకుండా చూడాలి
## -జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 7:

జిల్లాలో వేసవిలో త్రాగు నీరు ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం వి సి కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, మిషన్




భగీరథ, ఆర్డబ్ల్యూ ఎస్ అధికారులతో వివిధ శాఖల పనితీరు, చేపట్టవలసిన పనుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కు అధికారులు రబీ 2025--26 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు లో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 280 గ్రాజ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, వీటిలో దాదాపు అన్ని సెంటర్లు ప్రారంభించి, ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిపిసి సెంటర్ ఇన్‌చార్జిలకు సూచిస్తూ, ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని రకాల సామగ్రిని టీపీ సెంటర్లలో సిద్ధంగా ఉంచుకోవాలని, కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాల న్నారు. జిల్లాలోని అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ కోరారు. ఉపాధి హామీ పథకం పనుల గురించి మాట్లాడుతూ గ్రామపంచాయితీలలో సరాసరి 100 మంది కూలీలతో పనిచేయించాలని ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల అందరికీ ఫేస్ రికగ్నైజేషన్ ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు తీసుకోవాలని. నర్సరీలల్లో 100%జర్మనేషన్ వుండేలా చూడాలని. నర్సరీలకు షేడ్ నెట్ లు ఏర్పాటు చేయాలని, అన్నీ రకాల రిజిస్టర్లు నిర్వహించాలని

ఉపాధి హామీనందు అన్నీ పనులు యుక్తధార పోర్టల్ నందు గుర్తించాలని చేయవలెనని,ముఖ్యంగా నీటి సంరక్షణ పనులు గుర్తించాలి అని ఆదేశించారు.జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా పట్టించమైన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు కలిగితే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అన్నారు అలాగే ఎఫ్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని, బి ఎల్ ఓ వెరిఫై చేసి మ్యాపింగ్ ప్రోగ్రాం చేయాలని, బూత్ లెవెల్ ఏజెన్సీలను నియమించాలని, ఫారం పెండెన్సీ పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎస్ఓ మోహన్ బాబు, సిపిఓ కిషన్, డిపిఓ యాదగిరి ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని, ప్రజలెవరూ ఆందోళనతో బుకింగ్స్ చేయొద్దు.

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 07:




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని, ప్రజలెవరూ ఆందోళనతో బుకింగ్స్ చేయొద్దని శ్రీ భాస్కర రెడ్డి - జీఎమ్-ఎస్ఎల్సీ, విజయవాడ రిటైల్ ఆర్ఓ, హెచ్‌పిసిఎల్ కోరారు. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన పత్రికా సమాచార కార్యాలయం, విజయవాడ (పిఐబి) ఆధ్వర్యంలో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ నిల్వలు, సరఫరా, బ్లాక్ మార్కెటింగ్ నిరోధానికి చేపడుతున్న చర్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. గ్యాస్ సరఫరాలో ప్రజలకు ఎలాంటి అంతరాయాలు కలగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల గురించి తెలియజేశారు.

సమావేశంలో వెల్లడించిన అంశాలు:

గృహ వినియోగ గ్యాస్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసేందుకు ప్రారంభంలో వాణిజ్య సిలిండర్ల సరఫరాను పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 20% కి పరిమితం చేసినప్పటికీ, ప్రస్తుతం పరిస్థితి మెరుగుపడటంతో గత వినియోగంలో సగటున 70% వరకు సరఫరా చేస్తున్నాం.

పాఠశాలలు, ఆసుపత్రులు, రైల్వే క్యాంటీన్లతో పాటుగా రాష్ట్రంలోని అన్ని అన్నా క్యాంటీన్లకు పూర్తి స్థాయిలో వాణిజ్య సిలిండర్ల సరఫరా జరుగుతుంది.

గ్యాస్ బుకింగ్, డెలివరీ:

గతంలో ఆందోళనలతో కూడిన బుకింగ్స్ వల్ల రోజుకు 5 లక్షల వరకు బుకింగ్స్ జరిగేవి, కానీ ప్రస్తుతం ఇది సాధారణ స్థితికి చేరుకుని రోజుకు 2 లక్షల నుంచి 2.20 లక్షల బుకింగ్స్ జరుగుతున్నాయి.

చమురు కంపెనీలు రోజుకు 2,30,000 నుంచి 2,40,000 సిలిండర్లను సరఫరా చేస్తున్నాయి.

బుకింగ్స్ ఎక్కువగా ఉంటుండడం వల్ల కొన్ని చోట్ల డెలివరీ ఒకటి, రెండు రోజులు ఆలస్యం అవుతున్నాయి. అంతే కానీ, సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేవు.

ఎల్పీజీ సరఫరా దుర్వినియోగాన్ని నిరోధించేందుకు ఓటీపీ ఆధారిత డెలివరీలకు ప్రాధాన్యతనిస్తున్నాం. ఈ రోజు వరకు ఓటీపీ ఆధారిత డెలివరీలు 90% నికి చేరుకున్నాయి. దీనిని 100% కి చేర్చడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాం.

రాష్ట్రంలో ఎచ్ పి సి ఎల్ రిఫైనరీ ఉండటం వల్ల క్రూడ్ ఆయిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేదు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీ మెరుగైన స్థితిలో ఉంది.

వైజాగ్ నుండి గెయిల్ పైప్‌లైన్ ద్వారా నిరంతరాయ గ్యాస్ సరఫరా జరుగుతోంది.

పైప్డ్ న్యాచురల్ గ్యాస్ మరియు సబ్సిడీ:

భవిష్యత్తులో గ్యాస్ సరఫరాలో ఇలాంటి ఇబ్బందుల్ని తగ్గించేందుకు పైప్డ్ న్యాచురల్ గ్యాస్ కనెక్షన్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి.

మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న చోట ప్రజలు, పరిశ్రమలు పైప్డ్ గ్యాస్ కనెక్షన్‌లు తీసుకోవాలని ప్రజలను ప్రభుత్వం కోరుతోంది.

హోటళ్లు, రెస్టారెంట్లు, భారీ పరిశ్రమలు వంటివి పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్‌లకు మారాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో రాష్ట్రంలో దీపం పథకం కింద అందిస్తున్న ఎల్‌పిజి సబ్సిడీని పైప్‌లైన్ న్యాచురల్ గ్యాస్‌కు కూడా వర్తింపజేయాలని నిర్ణయించారు. పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా ఈ విషయంపై స్పష్టతనిచ్చారు.

నల్లబజారుపై చర్యల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్ ను అడ్డుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాయి. జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్‌లను ఏర్పాటు చేసి నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం.

బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 1079 తనిఖీలు నిర్వహించి, 4,300 సిలిండర్లను సీజ్ చేసింది.

ప్రజలకు సూచన పానిక్ బుకింగ్ చేయవద్దు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను నమ్మొద్దని, ప్రభుత్వ అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని అధికారులు సూచించారు.

గ్యాస్ బుకింగ్ రద్దీని నియంత్రించడానికి పట్టణ ప్రాంతాల్లో బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుండి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు మార్చడం జరిగింది.

పానిక్ బుకింగ్స్ వల్ల ప్రస్తుతం డెలివరీకి 4 నుండి 6 రోజులు సమయం పడుతోంది; పౌరులు ఆందోళన చెందవద్దని, గోడౌన్ల దగ్గరకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలని కోరుతున్నాము.


# జిన్నారం మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

## -జిల్లా కలెక్టర్ ప్రావిణ్య కు మెమోరండం
## సమర్పించిన మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్

జిన్నారం మున్సిపల్, ఏప్రిల్ 07 (భారత శక్తి న్యూస్): సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ చైర్మన్ నకీర్తి జనార్ధన్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ను కలిసి ఘనంగా శాలువతో సన్మానించి పుష్పగుచ్చాన్ని అందించారు. అనంతరం

జిన్నారం నూతన మున్సిపాలిటీలోని తీవ్ర నిధుల (బడ్జెట్) సమస్యలు నెలకొనడంతో పలు సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు మెమొరండం సమర్పించి పలు సమస్యలపై కులంకచంగా చర్చించి వివరించారు.

జిన్నారం మున్సిపల్ గ్రామీణ ప్రాంతం కాబట్టి అభివృద్ధిలో వెనుకబడి ఉన్నందున మున్సిపల్ కు సంపూర్ణ నిధులు లేనందున, మున్సిపాలిటీలోని వర్కర్లకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉంది కాబట్టి జిన్నారం మున్సిపల్ పై ప్రత్యేక శ్రద్ధ చూపించి ప్రభుత్వం ద్వారా ప్రత్యేక నిధులను కేటాయించాలని కలెక్టర్ ని కోరారు. జిన్నారం మున్సిపల్ పరిధిలో పలుచోట్లలో కొన్ని రోడ్ల పరిస్థితి బాగాలేక బస్సులు సకాలంలో రాక విద్యార్థులు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది ఉన్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.కలెక్టర్ పలు విషయాలపై సానుకూలంగా స్పందించి మీ జిన్నారం



మున్సిపల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్య పరిష్కారానికి కృషి చేశానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నకిర్తి జనార్దన్ తో పాటు కౌన్సిలర్ ప్రభాకర్ రెడ్డి,పావని పరమేశ్వర్ రెడ్డి, బెలి కృష్ణ, ఆది గీతా రామకృష్ణ , పూజారి ప్రమోద రాజు, శ్రీలత,నాగరాజు ఆశా దేవి, శంకరప్ప, శిల్పా నాగరాజు, బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

## షీ టీమ్స్, ఏహెచ్టియు కార్యాలయాల్ని సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 07 (భారతశక్తి): మహిళల భద్రతే షీ టీమ్స్ లక్ష్యమని ఎస్పీ రోహిత్ రాజ్ పేర్కొన్నారు. మంగళవారం చుంచుపల్లిలోని షీ టీమ్స్, ఏహెచ్టియు కార్యాలయాలను ఎస్పీ సందర్శించి, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, బ్లాక్మెయిలింగ్, ఇతర ఇబ్బందులు ఎదుర్కొనే మహిళలు జిల్లా షీ టీమ్స్ ను నేరుగా సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ తరపున ఏర్పాటు చేసిన టిజి డబ్ల్యూ ఎస్ డబ్ల్యూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకమైన విభాగమే షీ టీమ్స్ అని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలియజేశారు. జిల్లా షీ టీమ్స్ ఫోన్ నంబరు 8712682131 కి ఫోన్ చేసి తమ సమస్యలని తెలియ జేసుకోవచ్చన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని అన్నారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే నేరస్తుడిని షీ టీం కార్యాలయానికి పిలిచి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పరిస్థితిని బట్టి నిందితుడిపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. బాలికలకు, మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నిర్భయంగా షీ టీమ్స్ ను సంప్రదించాలని తెలియజేసారు. జనాలు రద్దీగా ఉండే ప్రదేశాలలో, రైల్వేస్టేషన్, బస్టాండ్లు, కళాశాలల వద్ద షీ టీమ్స్ సభ్యులు నిరంతరం సంచరిస్తూ ఆకతాయిల ఆగడాలను నిరోధిస్తూ మహిళలకు అండగా




నిలవాలని సూచించారు. మానవ అక్రమ రవాణా చేసి వారి అవయవాలను విక్రయించడం, వారితో వెట్టిచాకిరీ చేయించడం, వ్యభిచారంలోకి లాగడం, బాల్య వివాహాలు చేయడం లాంటివి జరగకుండా ఏహెచ్టియు సిబ్బంది భాద్యతగా పనిచేయాలని సూచించారు. ఇటువంటి నేరాలు జరగకుండా ఉండడానికి నిరంతరం జిల్లా మొత్తం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. మఫ్టీ దుస్తులలో సంచరిస్తూ నేరాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాలలో ఏహెచ్టియు, షీ టీం సిబ్బంది నిరంతరం సంచరిస్తూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మణ్, షీ టీం ఏఎస్సై నాగయ్య, షీ టీం సభ్యులు మల్లికాంబ, రాంబాబులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాం ల తనిఖీ



ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07 (భారత శక్తి): జిల్లా కేంద్రం కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోదాం లను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తనిఖీ చేశారు. గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మంగళవారం గోదాం సీల్.ను క్షుణ్ణంగా పరిశీలించారు.గోదాంలో అమర్చిన సీసీ కెమెరాల పనితీరును, అగ్నిమాపక పరికరాలను, ఫైర్ ఎక్స్‌టింగిషర్‌లను కలెక్టర్ తనిఖీ చేశారు.

అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఉన్న పోలీస్ బందోబస్తు, భద్రతా రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, భద్రతలో అలసత్వం వహించవద్దని ఆదేశించారు.ఎన్నికల ప్రక్రియలో కీలకమైన ఈవీఎంల భద్రత విషయంలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనే తనిఖీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎలక్షన్ సెల్ సూపరిండెంట్ ఎండి సలీం, డిప్యూటీ తహసీల్దార్ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్ పాల్గొన్నారు.వీరితో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరయ్యారు.

# ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టాలి:జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఏప్రిల్ 07 (భారతశక్తి): ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం అత్యంత కీలకమని జిల్లా కలెక్టరు అంకిత్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పాల్వంచ వైద్య ఆరోగ్య శాఖ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలకు నాణ్యమైన, అందుబాటులో ఉన్న వైద్య సేవలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 6 నుండి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఇతర జిల్లాలతో పోలిస్తే ఈ జిల్లాలో ప్రభుత్వ వైద్యంపై



ప్రజలకు ఉన్న నమ్మకం విశేషమని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు రాష్ట్ర స్థాయి అవార్డులను స్వీకరించేందుకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతికి వెళ్లినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కూడా అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య అధికారి తుకారాం రాథోడ్ మాట్లాడుతూ, జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, ఆరోగ్య పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 43 మంది ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ దారా ప్రసాద్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ ప్రసాద్ నాయక్, డాక్టర్ స్పందన, డాక్టర్ తేజస్వి, వైద్య శాఖ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తైబజార్ కమేల వేలం వాయిదా..

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07 (భారత శక్తి): ములుగు మునిసిపాలిటీ తైబజార్ బహిరంగ వేలం సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్, కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తైబజార్ వేలంలో ముగ్గురు మాత్రమే పాల్గొనడంతో వేలంపాట తక్కువగా వచ్చింది. పాట తక్కువగా రావడంతో అధికారులు తైబజార్ వేలాన్ని ఈ నెల 9 వ తేదీకి వాయిదా వేశారు.అదేవిధంగా కమేల వేలానికి ఎలాంటి దరఖాస్తులు రాకపోవడంతో దానిని కూడా 9 వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రకటించారు. వాయిదా పడిన రెండు వేలాలను ఈ నెల 09.04.2026న మళ్లీ మున్సిపల్ కార్యాలయంలో



నిర్వహించనున్నారు.ఈ వేలం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చింత నిప్పుల చంద్రకళ, కమిషనర్ టి. రమేష్ పాల్గొన్నారు. వీరితో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సెక్షన్ క్లర్క్ రమేష్ తదితరులు హాజరయ్యారు.ఆసక్తిగల వ్యక్తులు 9 వ తేదీన జరిగే వేలంలో పాల్గొనవచ్చని అధికారులు సూచించారు.

# హీరో విజయ్ పై ఐశ్వర్య రాజేశ్ ప్రశంసలు



దక్షిణాదిలో వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య రాజేశ్... తాజాగా కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ గురించి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా విజయ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తరుణంలో ఆయన వ్యక్తిత్వాన్ని కొనియాడుతూ ఐశ్వర్య చేసిన ఈ కామెంట్స్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విజయ్ ఎప్పుడూ ఇతరుల గురించి తప్పుగా మాట్లాడరని, తన పని తాను చేసుకుంటూ వెళతారని ఐశ్వర్య తెలిపారు. బయట ఎంతమంది విమర్శలు చేసినా, నెగెటివ్‌గా మాట్లాడినా ఆయన అవేమీ పట్టించుకోకుండా తన లక్ష్యం వైపు సాగిపోతారని ఆమె పేర్కొన్నారు. ఈ లక్షణమే ఆయనను అందరికంటే ప్రత్యేకం చేస్తుందని అభిప్రాయపడ్డారు.

"విజయ్ సార్‌కు తన అభిమానులే ప్రపంచం. వారిని ఎలా సంతోషపెట్టాలో ఆయనకు బాగా తెలుసు" అని ఐశ్వర్య కొనియాడారు. ఎన్ని అవరోధాలు ఎదురైనా తన వారి కోసం ఆయన నిలబడతారని, నేటి యువతకు ఆయన ఒక గొప్ప రోల్ మోడల్ అని ఆమె ప్రశంసించారు. సినిమాల విషయానికి వస్తే... ఆమధ్య వెంకటేశ్ సరసన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' అనే సినిమాతో ఐశ్వర్య భారీ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం తిరువీర్‌తో కలిసి 'ఓ సుకుమారి' అనే చిత్రంలో నటిస్తూనే, మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

## ఆర్టిస్టులు అంటే నేరస్తులా?.. ట్రోలర్లపై రేణు దేశాయ్ ఆగ్రహం

సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ట్రోలింగ్‌పై నటి రేణు దేశాయ్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన వ్యక్తిగత జీవితంపై అసభ్యకర వ్యాఖ్యలు చేస్తున్న నెటిజన్లకు 'భావ ప్రకటన స్వేచ్ఛ' అంటే ఏమిటో వివరిస్తూ ఒక ఘాటు వీడియోను షేర్ చేశారు.

"మీ దృష్టిలో ఆర్టిస్టులు అంటే నేరస్తులా లేక ఉగ్రవాదులా? అంత దారుణమైన మాటలతో దూషించడానికి వారు చేసిన తప్పేంటి?" అని ఆమె సూటిగా ప్రశ్నించారు. సెలబ్రిటీల అభిప్రాయాలు నచ్చకపోతే అన్‌ఫాలో చేయాలి తప్ప, నీచమైన పదజాలంతో దాడి చేయడం సంస్కారం కాదని హితవు పలికారు. చాలామంది బూతులు తిట్టడాన్ని 'భావ ప్రకటన స్వేచ్ఛ' అని పొరబడుతున్నారని, కానీ అది ముమ్మాటికీ వేధింపు కిందకే వస్తుందని ఆమె అన్నారు. ప్రతి మనిషికి సమాజంలో గౌరవంగా బతికే హక్కు ఉందని, ఎవరి వ్యక్తిగత స్వేచ్ఛను కాలరాయకూడదని రేణు అన్నారు. కష్టపడి పని చేస్తూ గౌరవంగా జీవించే కళాకారులను టార్గెట్ చేయడం మానుకోవాలని సూచించారు. ఇప్పటికే తనను దూషించిన వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయిస్తున్న విషయాన్ని గుర్తు చేస్తూ, నెటిజన్లు తమ ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని పరోక్షంగా హెచ్చరించారు. సోషల్ మీడియాలో హుందాగా ప్రవర్తించడం నేర్చుకోవాలని,



# అల్లరి నరేశ్ 'కనకదుర్గ' షురూ



విలక్షణ నటుడు అల్లరి నరేశ్ హీరోగా 'కనక దుర్గ' అనే కొత్త చిత్రం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి సురేఖ కొణిదెల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తమిళ చిత్ర పరిశ్రమలో విజయవంతమైన నిర్మాణ సంస్థ అఫ్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్, ఈ సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతోంది. టెంపుల్ టౌన్ పిక్చర్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్న ఈ భక్తి ప్రధాన యాక్షన్ చిత్రానికి బీవీఎస్ రవి కథను అందించారు. ఇందులో కాజల్ చౌదరి హీరోయిన్‌గా, సుబ్బరాజు కీలక పాత్రలో నటించనున్నారు. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, మెగాస్టార్ చిరంజీవి అర్ధాంగి కొణిదెల సురేఖ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. స్వప్న దత్ గౌరవ దర్శకత్వం వహించారు. భక్తి, యాక్షన్, భావోద్వేగాల కలయికగా ఈ సినిమా ప్రేక్షకులకు అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం తెలిపింది. ఈ కార్యక్రమానికి అల్లు అరవింద్‌తో పాటు శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీశ్ శంకర్, ప్రశాంత్ వర్మ, కోన వెంకట్, స్వప్నదత్ వంటి పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. దక్షిణ భారతంలో తమ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ, ఇప్పుడు 'కనక దుర్గ'తో తెలుగులోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉందని అఫ్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రతినిధులు తెలిపారు. తెలుగు నేల ఆధ్యాత్మికతతో ముడిపడి ఉన్న కథతో తమ ప్రయాణం మొదలవ్వడం ప్రత్యేకమని టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాతలు బీవీఎస్ రవి, అజిత్ ఠాకూర్ పేర్కొన్నారు. అమ్మవారిపై ఉన్న భక్తితో పాటు, ఒక మనిషి ఉన్నత శక్తిని ఎదుర్కొన్నప్పుడు ఏం జరుగుతుందనే కథాంశంతో ఈ సినిమా ఉంటుందని దర్శకుడు ప్రదీప్ మద్దాలి వివరించారు.

# ఘర్ వాపసీ తర్వాత మాజీ మిస్ ఇండియా ఎర్త్ అదృశ్యం.. పూణెలో కలకలం

మిస్ ఇండియా ఎర్త్ 2019 విజేత సాయ్లూ సర్వే అదృశ్యం కావడం పూణెలోని పింప్రి-చించ్‌వాడ్‌లో కలకలం రేపుతోంది. తన భర్తపై 'లవ్ జిహాద్', గృహహింస ఆరోపణలు చేసి, హిందూమతంలోకి తిరిగివచ్చిన (ఘర్ వాపసీ) కొన్ని రోజులకే ఆమె తన నలుగురు పిల్లలు సహా కనిపించకుండా పోయారు. తన కుమార్తెను, మనవళ్లను అత్తింటివారే కిడ్నాప్ చేశారని సాయ్లూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

**ఎవరీ సాయ్లూ సర్వే?.. ఏం జరిగింది?**

ఏవియేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసిన సాయ్లూ సర్వే మోడలింగ్ రంగంలో రాణించి 2019లో మిస్ ఇండియా ఎర్త్ కిరీటాన్ని గెలుచుకున్నారు. కొన్నేళ్ల క్రితం ఆమె తన కుటుంబ సభ్యుల ఇష్టానికి వ్యతిరేకంగా ముస్లిం వ్యాపారవేత్త అయిన అతిఫ్ టసేను ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇందుకోసం ఇస్లాం మతం స్వీకరించి, తన పేరును అతీజా టసేగా మార్చుకున్నారు. అయితే, పెళ్లైన కొద్ది కాలానికే భర్త, అత్తింటివారి నుంచి తీవ్రమైన శారీరక, మానసిక వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె ఆరోపించారు. తన జీవితంలో అతిఫ్‌ను పెళ్లి చేసుకోవడమే అతిపెద్ద




తప్పిదమని ఆమె పేర్కొన్నారు.

**'లవ్ జిహాద్' ఆరోపణలు.. ఘర్ వాపసీ**

కొన్ని వారాల క్రితం పింప్రి-చించ్‌వాడ్‌లో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో సాయ్లూ సర్వే శుద్ధి కార్యక్రమం ద్వారా తిరిగి హిందూమతంలోకి వచ్చారు. ఈ సందర్భంగా తన పేరును ఆద్యా సర్వేగా మార్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మేధా కులకర్ణి, ఎమ్మెల్యే ఉమా ఖప్రే, భజరంగ్ దళ్ సభ్యులు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ "ఇది కచ్చితంగా లవ్ జిహాద్ వ్యవహారమే. 24 గంటలూ తిట్లు, కారణం లేకుండా దెబ్బలు తింటుంటే, మొదట్లో అసాధారణంగా అనిపించిన విషయాలు కూడా సాధారణమైపోతాయి. నా నలుగురు పిల్లల కోసమే ఇన్నేళ్లు ఓపిక పట్టాను" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం జరిగిన కొన్ని రోజులకే సాయ్లూ తన నలుగురు పిల్లలు సహా అదృశ్యమయ్యారు. దీంతో ఆమె తల్లిదండ్రులు పింప్రి-చించ్‌వాడ్ పోలీసులను ఆశ్రయించారు. టసే కుటుంబ సభ్యులే తమ కుమార్తెను కిడ్నాప్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాయ్లూ ఘర్ వాపసీకి మద్దతుగా నిలిచిన హిందూ సంఘాలు ఈ ఘటనపై ఆందోళనలు చేపట్టి, ఆమెను వెంటనే కనిపెట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ఈ ఆరోపణలను సాయ్లూ అత్తగారైన గుల్షన్ టసే ఖండించారు.

# సినిమాల్లోకి దేవయాని కూతురు.. తెలుగు 'కోర్టు' రీమేక్‌తో ఎంట్రీ!

ఒకప్పటి ప్రముఖ నటి దేవయాని వారసురాలు సినీ రంగ ప్రవేశం చేస్తున్నారు. ఆమె చిన్న కుమార్తె ప్రియాంక రాజ్ కుమారన్ నటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. విశేషమేమిటంటే.. ఆమె తొలి చిత్రం 2024లో తెలుగులో వచ్చిన 'కోర్టు' సినిమాకు తమిళ రీమేక్ కావడం. పోక్సో చట్టంపై అవగాహన కల్పించే సామాజిక సందేశంతో ఈ చిత్రం రూపొందుతోంది. తెలుగు సినిమా 'కోర్టు' ఆధారంగా తమిళంలో 'రంజన్: ది అడ్వకేట్' పేరుతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు త్యాగరాజన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, ఆయన కుమారుడు జీన్స్ ప్రశాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. తెలుగు మాతృకలో శ్రీదేవి పోషించిన కథానాయిక పాత్రను ప్రియాంక పోషించనుంది. ఈ సినిమా ప్రారంభోత్సవం సోమవారం చెన్నైలో ఘనంగా జరిగింది. ఈ చిత్రంతోనే నిర్మాత ఎస్. కదిరేశన్ కుమారుడు హరి కూడా నటుడిగా పరిచయం అవుతుండటం గమనార్హం. తెలుగులో హర్ష్ రోషన్ పోషించిన పాత్రను హరి చేయనున్నారు.






## కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో

# డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్ డి ఎస్) సమావేశం

కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 07: జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జిజిహెచ్), కామారెడ్డిలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ (హెచ్ డి ఎస్) సమావేశం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన, ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి సమక్షంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం నిర్వహించబడింది. సమావేశం ప్రారంభంలో సభ్య కార్యదర్శి/సూపరింటెండెంట్ హాజరైన సభ్యులను ఆహ్వానించారు.

**సమావేశంలో చర్చించిన ముఖ్యాంశాలు:**

గత సమావేశపు నిమిషాలను పరిశీలించి, తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. చేపట్టిన పనుల్లో సుమారు 99% పూర్తయ్యాయని వెల్లడించారు.

హెచ్‌డీఎస్ నిధుల ఆర్థిక స్థితిపై వివరాలు అందించారు. సుమారు రూ, 18 లక్షలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అందులో రూ,10 లక్షలు క్యాన్సర్ కేర్, పాలియేటివ్ సేవలకు కేటాయించగా, రూ,2 లక్షలు హాస్పిటల్ క్యాంటీన్ కాషన్ డిపాజిట్‌గా వినియోగించినట్లు తెలిపారు. మిగిలిన నిధులను పెండింగ్ పనుల కోసం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా వినియోగించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే కేసీఆర్ కిట్ అమలు తర్వాత ప్రసూతి కేసుల పెరుగుదలపై వివరాలు కోరడంతో పాటు ట్రామా కేసుల గణాంకాలను సమర్పించాలని సూచించారు. హాస్పిటల్‌లో సీటీ స్కాన్ సౌకర్యం లేకపోవడం వల్ల ట్రామా రోగులను ఇతర ఆసుపత్రులకు తరలించాల్సి వస్తోందని చర్చించారు. ప్రస్తుత టిహబ్ భవనంలో సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు.

రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు రాజన్న సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ (ఎస్ డి పి) అందుబాటులో లేకపోవడంపై ప్రస్తావించారు. యంత్రం ఉన్నప్పటికీ ప్రతి యూనిట్‌కు సుమారు రూ,8000 వ్యయం అవుతున్నందున ఆర్థిక పరిమితులు ఉన్నట్లు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే



ఇండెంట్ పంపించాలని, అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్య తీర్మానంగా జీజీహెచ్ ఆసుపత్రిని కొత్త భవనానికి మార్చే అంశంపై చర్చించారు. మెడికల్ కాలేజ్ భవనం జూన్ నాటికి పూర్తయ్యే అవకాశముందని తెలిపారు. కాలేజ్ అక్కడికి మారిన అనంతరం ప్రస్తుత ఎంసిహెచ్ భవనాన్ని ఆసుపత్రి వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ మార్పు ప్రక్రియ పర్యవేక్షణ కోసం టిఎస్ఎమ్ఐడిసి, ఆర్&బి ఇంజినీర్లు, సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్, అదనపు కలెక్టర్, డిఎమ్ హెచ్ఓ, ఆర్డీఓ, ఆర్ఎమ్ఓలతో కమిటీ ఏర్పాటు చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ తరఫున రాజన్న హాస్పిటల్‌కు ఒక వెంటిలేటర్ అందజేస్తామని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అత్యవసర సేవల విభాగాన్ని బలోపేతం చేయడం, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఎ సి ఎల్ బి మధుమెహన్, మున్సిపల్ చైర్మన్ ఉమారాణి, సూపరిండెంట్ వెంకటేశ్వర్, ప్రిన్సిపాల్ వాల్యా, ఆర్డీఓ ఎన్ వి గిరి, ఈఈ ఆర్ అండ్ బి, ఈఈ పిఆర్, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.



## బండారి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల జిల్లా ఏప్రిల్ 07:(భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి బిఆర్ఎస్ పార్టీ పట్టణ కన్వీనర్ బండారి రంజిత్ నానమ్మ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మరియు బుద్దేశ్ పల్లె గ్రామానికి చెందిన పెంట గంగారాం భార్య సుశీల ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని మరియు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన మాదాసు అమర్నాథ్ కుటుంబాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెంట మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ సంగి సత్తెమ్మ, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ అయ్యోరి రాజేష్, ఎల్లా గౌడ్, చిర్నేని నర్సయ్య, బాకీ శేఖర్, ఆసిఫ్, చుక్క రవి, బండారి అశోక్, సంగి శేఖర్, గుర్రాల సుధాకర్, శ్యామ్, విజయ్, జగన్, మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని ఆ కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాకారం

- * కాంగ్రెస్ చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు
- * ధరావత్ వీరన్న నాయక్

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 7: పేదల స్వంతింటి కల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంతోనే సాకారం అవుతుందని మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బధ్యతండా గ్రామంలో బానోతు సైదమ్మ కృష్ణల నూతన ఇందిరమ్మ ఇళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు 10 సంవత్సరాల్లో ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎప్పటికీ అర్హులైన వారందరికి ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మొదటి విడతలో మండల వ్యాప్తంగా 545 ఇండ్లు మంజూరు కాగా ఇప్పటి అన్ని ఇండ్లు పూర్తి కావస్తున్నాయని తెలిపారు. మొదటి విడతలో ఇండ్లు రాని వారు బాధ పడవద్దని వారికి రెండవ విడతలో అర్హులైన వారందరికి ఇండ్లు ఇండ్లు వస్తాయని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రెండవ విడతలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్యల సహకారంతో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు ధారవత్ కనకమ్మ సోమాని నాయక్, బానోతు వెంకన్న నాయక్, మాజీ సర్పంచ్ పద్మ మంగ్తియా, నాయకులు బానోతు రాజా, చంప్లా, నాగేశ్వర్ రావు, శ్రీను నాయక్, దేవ్ల నాయక్, లాలూ నాయక్, సైదా నాయక్, భాష నాయక్, వీరన్న నాయక్, నాగు నాయక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్&ఆర్ పరిహార పంపిణీలో జాప్యం జరగకూడదు : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, ఏప్రిల్ 7(భారత శక్తి ) : జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఆర్&ఆర్ ప్రక్రియలో భాగంగా పరిహార పంపిణీ లేదా పునరావాసం పంపిణీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత ఇరిగేషన్ ఉన్నతాధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఆర్&ఆర్ పెండింగ్ పనులపై జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జేసీ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన లతో కలిసి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి డిప్యూటీ కలెక్టర్లు ఆయా ప్రాజెక్టుల పరిధిలో విస్తరణ, అభివృద్ధి పనుల్లో భాగంగా భూ సేకరణ, ఆర్ & ఆర్ కోసం బడ్జెట్ కేటాయింపు, సంబందిత అవసరాల నిమిత్తం ప్రణాళికలు చేసుకొని కేటాయింపుల వివరాలను కూడా పొందుపరుస్తూ నివేదికలు అందజేయాలన్నారు. అలాగే భూ సేకరణ ప్రక్రియలో భాగంగా అన్ని రకాల రెవెన్యూ, పర్యావరణ అనుమతులతో పాటు కోర్టు కేసు వ్యవహారాలను అధిగమించేందుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని అన్ని రకాల సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో 1.30 లక్షల ఎకరాలకు పైగా భూసేకరణ చేయడం జరిగిందన్నారు. సంబందిత ప్రాజెక్టుల పరిధిలో భూ సేకరణ విషయంలో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ



నేపథ్యంలో భూ రికార్డులను పరిశీలించి ఎక్కడా కూడా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్ అండ్ ఆర్ కు సంబంధించి ఇప్పటికే అవార్డు పాస్ అయి పేమెంట్స్ పెండింగ్ ఉన్న గ్రామాలు, పరిహారం లభిదారుల వివరాల జాబితాను తయారు చేయాలన్నారు. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జలాధార కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేస్తూ అన్ని సాగునీటి ప్రాజెక్టుల్లో జలాధార పనితీరు సత్ఫలిఫలితాలను ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు ఆర్డీవోలు మురళి, చంద్రమోహన్, చిన్నయ్య, శిరీష, టిజిపి 2 ఎస్డీసి నాగజ్యోతి, జిఎన్ఎస్ఎస్, ఇరిగేషన్, పీఆర్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. లు చిన్నకొండారెడ్డి, అబ్బాస్ సమీ, మద్దన్న, ఏడుకొండలు, ఆయా ప్రాజెక్టుల పరిధిలోని తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ పరిశీలన

జగిత్యాల, ఏప్రిల్ 07( భారత శక్తి ప్రతినిధి ): జిల్లాలో నిర్వహించనున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై పురోగతిని సమీక్షించేందుకు జిల్లా కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన పిపిటి సమావేశంలో టెక్నికల్ కమిటీ సమగ్ర పరిశీలన నిర్వహించారు. ఈ పరిశీలనకు ఇంజినీర్ఇన్ చీఫ్ (జనరల్) ఓ.వి. రమేష్‌బాబు మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా గోదావరి పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి, భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, తాగునీటి సరఫరా, పారిశుధ్య ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత





అధికారులకు సూచించారు. అలాగే, ఘాట్‌ల అభివృద్ధి పనులు, రహదారి మరమ్మత్తులు, విద్యుత్ సరఫరా, తాత్కాలిక సౌకర్యాల ఏర్పాటు వంటి అంశాలను వేగవంతం చేయాలని టెక్నికల్ కమిటీ సూచించింది. అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఈ.ఈ.పి. ఆర్. లక్ష్మణ్ రావు, ఈ.ఈ. ఆర్ అండ్ బి శ్రీనివాస్, ధర్మపురి టెంపుల్ ఈవో శ్రీనివాస్, నీటి పారుదల శాఖ అధికారుల, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా

# కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కు పరిమితం: హరీశ్ రావు


- * కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని సీఎం పగటి కలలు కంటున్నారన్న హరీశ్ రావు
- * రెండున్నరేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూని చేశారని ఆగ్రహం
- * కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా రాదన్న హరీశ్ రావు

ఏప్రిల్ 07(భారత శక్తి ప్రతినిధి): ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలవబోదని, సింగిల్ డిజిట్‌కు పరిమితమవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పరిగి ఇండస్ట్రియల్ పార్క్ బాధితులను కలవడానికి బయలుదేరడంతో పోలీసులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. శంషాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు, ఆ తర్వాత వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని వ్యాఖ్యానించారు. గత రెండున్నరేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సింగిల్ డిపాజిట్‌కు పరిమితమవుతుందని అన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించకూడదని, ఆందోళనలు, ధర్నాలు నిర్వహించరాదని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, విచారణలు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తమను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. రైతులను




పరామర్శించేందుకు వెళుతుంటే అరెస్టు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో రామరాజ్యం లాంటి కేసీఆర్ రాజ్యం వస్తుందని అన్నారు.

# తెలంగాణ డీజీపీ కాన్వాయ్ ట్రయల్ రన్‌లో ప్రమాదం.. స్వల్పంగా దెబ్బతిన్న వాహనాలు



హైదరాబాద్, 07(భారత శక్తి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి కాన్వాయ్ ట్రయల్ రన్ సందర్భంగా ప్రమాదం చోటు చేసుకుంది. డీజీపీ పర్యటనకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగా ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో పోలీసులు ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ క్రమంలో వెంకటాపురం వద్ద వాహనాలు వేగంగా వెళుతుండగా ఒక పోలీసు వాహనం అదుపుతప్పి ముందు వెళుతున్న వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు వెంటనే ఆ వాహనాలను పక్కకు తొలగించారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించనున్నారు. కర్రెగుట్టలోని పాముసూరు సీఆర్పీఎఫ్ బస్ క్యాంపును డీజీపీ పరిశీలిస్తారు. ఆ తర్వాత పోలీసు ఔట్ పోస్టుకు భూమి పూజ చేస్తారు. ఆ ప్రాంతంలోని గ్రామాలకు వేస్తున్న రోడ్లను పరిశీలిస్తారు. డీజీపీ కర్రెగుట్ట పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆయన పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# కవితక్క వెంట బి.సి ఉద్యమనేత..!





* **12న నూతన పార్టీలోకి అల్లంపల్లి రామకోటి.. బీసీ నినాదంతో కవిత అడుగులు**
* **మహిళా సీఎం' నినాదమే అజెండాగా రాబోతున్న కొత్త పార్టీ?**

హైదరాబాద్, ఏప్రిల్ 7 (భారత శక్తి) : తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపునకు సిద్ధమవుతోంది. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించబోయే నూతన రాజకీయ పార్టీలోకి బీసీ ఉద్యమ శ్రేణుల వలసలు మొదలయ్యాయి. గత మూడు దశాబ్దాలుగా బీసీల హక్కుల కోసం ఆర్. కృష్ణయ్య నాయకత్వంలో పోరాడుతున్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లంపల్లి రామకోటి ముదిరాజ్.. కవిత స్థాపించబోయే కొత్త పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 12వ తేదీ (ఆదివారం) ఉదయం 10 గంటలకు కవిత నివాసమైన జాగృతి భవన్‌లో ఆయన అధికారికంగా తీర్థం పుచ్చుకోనున్నారు.

* **30 ఏళ్ల పోరాట ప్రస్థానం.. ఇప్పుడు రాజకీయ మలుపు**

ఆర్.కృష్ణయ్య శిష్యుడిగా, నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచిన అల్లంపల్లి రామకోటి.. బీసీల విద్య, ఉద్యోగ, సామాజిక అభివృద్ధి కోసం ఎన్నో పోరాటాలు చేశారు. అసెంబ్లీ ముట్టడి మొదలుకొని పార్లమెంట్ పోరాటాల వరకు ఆయన ప్రస్థానం సాగింది.

* **ప్రధాన డిమాండ్లు:**

చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు, పార్లమెంట్‌లో బీసీ బిల్లు, స్థానిక సంస్థల్లో జనాభా దామాషా ప్రకారం కోటా.

* చేరిక వెనుక అంతర్యుఖం: బీసీల గళాన్ని బలంగా వినిపించే వేదిక కోసం వెతుకుతున్న రామకోటి.. కవిత నాయకత్వమే సరైనదని భావిస్తున్నట్లు తెలుస్తోంది.

* **కవిత అక్క పార్టీ అజెండా.. బీసీలే వెన్నెముక?**

తెలంగాణలో కొత్త పార్టీలు పుట్టుకొస్తున్నా, బీసీల అభివృద్ధి మాత్రం అట్టడుగున ఉందన్న ఆవేదన ఉద్యమకారుల్లో స్పష్టంగా కనిపిస్తోంది. "దేశ సంపదలో సగం బీసీలదే అయినా, అధిక పన్నులు కట్టేది బీసీలే అయినా.. ఓట్లు వేసే యంత్రాలుగా, పల్లకీలు మోసే బోయిలుగానే మిగిలిపోతున్నాం" అన్న వాదనను రామకోటి బలంగా వినిపిస్తున్నారు. కవిత పార్టీ ఈ అసమానతలను తొలగిస్తుందని ఆయన వర్గం నమ్ముతోంది.

* **రాజకీయ పరిణామాలు ఎలా ఉండబోతున్నాయి**

రామకోటితో పాటు భారీ సంఖ్యలో అడ్వకేట్లు, నిరుద్యోగ జేఏసీ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు కవిత పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా బీసీ వర్గాల్లో బలమైన పట్టున్న నాయకులు చేరడం వల్ల, రాబోయే రోజుల్లో ఇతర పార్టీలకు బీసీ ఓటు బ్యాంకు విషయంలో గట్టి సవాల్ ఎదురయ్యే అవకాశం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో 'మహిళా సెంటిమెంట్' మరియు 'బీసీ కార్డు' రెండింటినీ రంగరించి కవిత కొత్త వ్యూహంతో ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది. మరి 12వ తేదీన జరిగే ఈ చేరికలు రాష్ట్ర రాజకీయాల్లో ఎటువంటి ప్రకంపనలు సృష్టిస్తాయో వేచి చూడాలి.





జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా వెంగళ్‌రావు నగర్ డివిజన్ పరిధిలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీతకి మద్దతుగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి కార్పొరేటర్ దేదీప్య రావు భారాస నాయకులు పాల్గొన్నారు.
హైదరాబాద్, అక్టోబర్ 31 (భారత శక్తి ):



## ధర్మపురి మార్కెట్ యార్డ్ మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు విడుదల

జగిత్యాల, ఏప్రిల్ 7(భారత శక్తి ప్రతినిధి): ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటి నందు అభివృద్ధి పనులు చేపట్టుటకు తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు మార్కెట్ యార్డు నందు కావలసిన మౌళీక సదుపాయాల గురించి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంటనే స్పందించి మార్కెటింగ్ శాఖా ద్వారా 160.00 లక్షలు నిధులను మార్కెట్ కమిటి పరిధిలోని దుబ్బాల గూడెం గ్రామము నందు గల నాబార్డ్ గోదాము చుట్టూ ప్రహరి గోడ నిర్మాణము మరియు మార్కెట్ యార్డు నందు చైర్మన్ ఛాంబర్, సి.సి వర్క్ నిర్మాణమునకు నిధులు మంజూరి చేస్తూ ప్రొసిడింగ్ ఇచ్చారు. అదేవిధముగా మార్కెట్ యార్డ్ పరిధిలో 202526 ఆర్థిక సంవత్సరం గాను సంచాలకులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖా తెలంగాణ ప్రభుత్వ, హైదరాబాదు వారు 239.49 లక్షల నిర్దిష్ట లక్ష్యం ఇవ్వగా 382.46 లక్షలు మార్కెట్ ఫీజు వసూలు చేసి జగిత్యాల జిల్లా వ్యాప్తంగా మొదటి స్థానములో నిలిచినందుకు గాను చైర్ పర్సన్, కార్యదర్శి మరియు సిబ్బందిని మంత్రి అభినందించారు. మార్కెట్ యార్డ్ కు నిధులు విడుదల చేసిన సందర్భంగా మంత్రిని మార్కెట్ కమిటి చైర్ పర్సన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, వైస్ చైర్మన్ సంగ నర్సింహులు , సభ్యులు వాంకుదోత్ గీతాంజలి , గంధం రాజయ్య , కాశెట్టి రాజు, గునిశెట్టి అంజయ్య , మార్కెట్ కమిటి కార్యదర్శి డి. శ్రీనివాస్ రావు మంత్రి ని కలసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఓయో లాడ్జిలలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి




ఎల్బీనగర్, ఏప్రిల్ 07 (భారత శక్తి): సరూర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ శ్రీశైలం సరూర్నగర్ పరిధిలోని ఓయో హోటళ్లలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను అరికట్టుటకు సంబంధించి సరూర్‌నగర్‌లోని ఓయో హోటల్ యజమానులను సమావేశానికి ఆహ్వానించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారికి మర్యాదపూర్వకంగా సూచనలు అందజేశారు.సీఐ వారికి అదనంగా క్రింది సూచనలు

1. మైనర్లకు (అపరిపక్వ వయస్సు గల వారికి) గదులు కేటాయించరాదు.
2. అతిథుల పూర్తి వివరాలను సరైన రిజిస్టర్లలో నమోదు చేయాలి.
3. ప్రతి అతిథి నుండి సరైన గుర్తింపు పత్రాలు (ఐడి ప్రూఫ్ ) తప్పనిసరిగా తీసుకోవాలి.
4. సీసీ కెమెరాలను సక్రమంగా పని చేసే విధంగా ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షణలో ఉంచాలి.
5. హోటల్ పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఏసీబీ వలలో అగ్రికల్చరల్ వర్సిటీ అసోసియేట్ డీన్

* **సీడ్ లైసెన్స్ కోసం లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ దొరికిపోయిన డాక్టర్ గోవర్ధన్**
* **రాజేంద్రనగర్, ఏప్రిల్ 7 భారత శక్తి:***

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అవినీతి తిమింగలం ఏసీబీ అధికారులకు చిక్కింది. సీడ్ లైసెన్స్ మంజూరు చేసేందుకు ఓ వ్యాపారి నుంచి భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేసిన అగ్రానమీ విభాగం అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం. గోవర్ధన్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

* **పథకం ప్రకారమే వేట..**

ఏసీబీ సిటీ రేంజ్ II అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు తన విత్తన సంస్థకు (Seed Firm) సంబంధించి లైసెన్స్ పొందడం కోసం వ్యవసాయ శాఖను సంప్రదించారు. అయితే, ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు మరియు భవిష్యత్తులో తన వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు కలగకుండా చూసేందుకు డాక్టర్ గోవర్ధన్ గతంలోనే రూ. 25,000 వసూలు చేశారు. తాజాగా మరో రూ. 1,00,000 అదనంగా డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు.

*కెమికల్ టెస్టులో దొరికిపోయారు..*

మంగళవారం సాయంత్రం బాధితుడి నుంచి సదరు అధికారి నగదు తీసుకుంటుండగా అధికారులు మెరుపు దాడి చేశారు. ఆయన వద్ద నుంచి రూ. 1,00,000 స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జరిపిన రసాయన పరీక్షలో గోవర్ధన్ ఎడమ చేతి వేళ్లు 'పాజిటివ్'గా తేలడంతో ఆయన లంచం తీసుకున్నట్లు శాస్త్రీయంగా నిర్ధారణ అయింది. నిందితుడిని అరెస్ట్ చేసిన అధికారులు బుధవారం నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నారు.

***అవినీతిపై సమాచారమివ్వండి**


ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెనుకాడకుండా ఏసీబీ టోల్



ఫ్రీ నంబర్ *1064కు లేదా వాట్సాప్ నంబర్ **9440446106*కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సింధు శర్మ ఒక ప్రకటనలో కోరారు. ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని ఆమె స్పష్టం చేశారు.

## అక్రమంగా రేషన్ బియ్యం తరలింపు

* **26 క్వింటాళ్లు స్వాధీనం, నిందితుడి అరెస్ట్..**




ఎల్బీనగర్, ఏప్రిల్ 07 (భారత శక్తి): పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. అప్రమత్తంగా వ్యవహరించిన నాగోల్ పోలీసులు వాహన తనిఖీల్లో భాగంగా 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్ట్ చేశారు.నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం... ఉమ్మడి నల్లగొండ జిల్లా తుర్కపల్లి మండలం పెన్ పహాడ్ గ్రామానికి చెందిన రవి నాయక్ అనే వ్యక్తి టీఎస్ 30 టీఏ 4286 నంబర్ గల టాటా ఏస్ వాహనంలో భారీగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా శంషాబాద్ ప్రాంతానికి తరలిస్తున్నాడు.ఈ నేపథ్యంలో మంగళవారం నాగోల్ చౌరస్తా వద్ద ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధారణ వాహనాల తనిఖీలలో భాగంగా సంబంధిత వాహనంపై అనుమానం కలగడంతో పోలీసులు దానిని ఆపి తనిఖీ చేశారు. తనిఖీలలో వాహనంలో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం నిల్వ ఉంచి తరలిస్తున్నట్లు గుర్తించారు.పరిశీలనలో భాగంగా వాహనంలో సుమారు 26 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు శంషాబాద్ ప్రాంతంలోని ఇటుక బట్టీలలో పనిచేసే కూలీలకు విక్రయించేందుకు వెళుతున్నట్లు నిర్ధారించినట్లు సిఐ పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే ఈ బియ్యాన్ని అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి లాభాపేక్షతో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.ఈ ఘటనపై నిందితుడిపై 7 ఈసీ పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు, స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. ఇలాంటి అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా అనుమానస్పదంగా రేషన్ సరుకుల తరలింపు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ మహ్మద్ మక్బూల్ జానీ సూచించారు.

## హైదరాబాద్‌లో రూ.64.35 లక్షల డ్రగ్స్ స్వాధీనం



హైదరాబాద్, ఏప్రిల్ 07 (భారత శక్తి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుకున్నారు. చిలకలగూడ, ఆదిభట్ల, సనత్ నగర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి, రూ.64.35 లక్షల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసు వివరాలను టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో డ్రగ్స్‌తో పాటు రూ.50,000 నగదు, ద్విచక్ర వాహనం, మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులు గతంలో ఉద్యోగాలు చేశారని, ఆ తర్వాత టైల్స్ వ్యాపారం నిర్వహించినట్లు చెప్పారు. ఈ వ్యాపారంలో నష్టం రావడంతో ఆ తర్వాత డ్రగ్స్ వ్యాపారంలోకి వచ్చారని చెప్పారు.

# ట్రంప్ హెచ్చరిక: ఇరాన్ అంతమైపోతుంది!

వాషింగ్టన్/న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాతో ఒప్పందానికి ఇరాన్ అంగీకరించని పక్షంలో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. "ఈ రాత్రికే ఓ నాగరికత మొత్తం అంతమైపోతుంది, మళ్లీ తిరిగి తీసుకురాలేని విధంగా అంతరించిపోతుంది" అని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. "అలా జరగాలని నేను కోరుకోవడం లేదు, కానీ బహుశా అదే జరుగుతుంది" అని ట్రంప్ తన పోస్టులో పేర్కొన్నారు. అయితే, ఇరాన్‌లో 'సంపూర్ణ పాలన మార్పు' జరిగి, వివేకవంతులైన, కొత్త ఆలోచనాపరులు అధికారంలోకి వస్తే విప్లవాత్మకమైన అద్భుతాలు కూడా జరగవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. "ఏం జరుగుతుందో ఎవరికి తెలుసు?" అని ప్రశ్నించారు. ప్రపంచ సుదీర్ఘ, సంక్లిష్ట చరిత్రలోనే ఇది అత్యంత కీలకమైన క్షణాలలో ఒకటని ట్రంప్ అభివర్ణించారు. 47 ఏళ్ల దోపిడీ, అవినీతి, మరణాలకు ఈ రాత్రితో ముగింపు పడుతుందని ఆయన పేర్కొన్నారు. "గొప్ప ఇరాన్ ప్రజలను దేవుడు ఆశీర్వదించాలి" అంటూ తన పోస్ట్‌ను ముగించారు. ట్రంప్ చేసిన ఈ తీవ్రమైన హెచ్చరిక వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటనే దానిపై అంతర్జాతీయ రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఇరాన్‌లోని భారతీయులకు హై అలర్ట్!

న్యూఢిల్లీ / టెహ్రాన్, ఏప్రిల్ 7 : ఈ రాత్రి తాము చేయబోయే దాడులతో ఓ నాగరికత ముగిసిపోతుందని, ఈ రాత్రి ప్రపంచ చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచిపోతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు తీవ్ర హెచ్చరిక జారీ చేయడం పట్ల భారత కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారత పౌరుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అత్యవసర హెచ్చరికలను జారీ చేసింది. రాబోయే 48 గంటల పాటు భారతీయులందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడివారు అక్కడే ఇళ్లకు పరిమితం కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఈ హెచ్చరికలను భారతీయులందరూ తక్షణం పాటించాలని ప్రభుత్వం కోరింది. రాయబార కార్యాలయం జారీ చేసిన సలహాలో పలు కీలకమైన సూచనలు ఉన్నాయి. "తదుపరి 48 గంటల పాటు మీరు ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. అనవసరంగా బయటకు రావద్దు. ముఖ్యంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, సైనిక స్థావరాలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి సున్నితమైన ప్రాంతాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. బహుళ అంతస్తుల భవనాల్లో నివసించే వారు పై అంతస్తుల్లో ఉండవద్దు" అని స్పష్టం చేసింది. అత్యవసరంగా రహదారి ప్రయాణాలు చేయాల్సి వస్తే, తప్పనిసరిగా రాయబార కార్యాలయ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే ఎంబసీ ఏర్పాటు చేసిన వసతి గృహాలు, హోటళ్లలో ఉన్నవారు తమ గదులను విడిచి బయటకు వెళ్లవద్దని, అధికారులతో నిరంతరం టచ్‌లో ఉండాలని కోరింది. హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవాలని లేదా ఒప్పందానికి రావాలని, లేనిపక్షంలో ఏప్రిల్ 78 తేదీల్లోగా ఇరాన్‌లోని విద్యుత్ ప్లాంట్లు, వంతెనలపై తీవ్ర దాడులు తప్పవని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ రాత్రికి ఇరాన్ జాతి మొత్తం తుడిచిపెట్టుకుపోతుందని కూడా ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే భారత ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఇరాన్‌లో ఉన్న విద్యార్థులు, వ్యాపారులు, యాత్రికులు సహా భారతీయులందరి భద్రతకే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రభుత్వం స్పష్టం చేసింది. అత్యవసర సహాయం కోసం రాయబార కార్యాలయం 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మొబైల్ నంబర్లను (+989128109115, +989128109102, +989128109109, +989932179359) అందుబాటులోకి తెచ్చింది. అలాగే cons.tehran@mea.gov.in ఈమెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చని తెలిపింది. పరిస్థితి వేగంగా మారే అవకాశం ఉన్నందున, పౌరులందరూ అధికారిక ప్రకటనలను నిరంతరం గమనిస్తూ ఉండాలని విజ్ఞప్తి చేసింది.

# కమికాజే డ్రోన్లు సిద్ధం..
# శత్రువులకు ఇక గండమే!

సూరత్/న్యూఢిల్లీ: ఏప్రిల్ 07 భారత సైన్యం తన ఆయుధ సామర్థ్యాన్ని అంతకంతకూ పెంచుకుంటోంది. తాజాగా, శత్రువుల గుండెల్లో నిద్రపోయేలా 'ఆత్మాహుతి డ్రోన్ల' (కమికాజే)ను తన అమ్ములపొదిలో చేర్చుకుంది. ఆధునిక యుద్ధ తంత్రాల్లో కీలక పాత్ర పోషించే ఈ డ్రోన్లను స్వదేశీ సంస్థ కేవలం రెండు నెలల వ్యవధిలోనే సైన్యానికి అందజేయడం విశేషం. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన 'ఇన్‌సైడ్ ఎఫ్‌పీవీ' అనే సంస్థ సుమారు రూ. 10 కోట్ల ఒప్పందంలో భాగంగా వందలాది ఆత్మాహుతి డ్రోన్లను ఆర్మీ నార్తర్న్ కమాండ్‌కు అప్పగించింది. సరిహద్దుల్లో మారుతున్న భద్రతా సమీకరణాల దృష్ట్యా, ప్రాణనష్టం లేకుండా శత్రువులను తుదముట్టించేందుకు సైన్యం వీటిని అత్యవసరంగా సమకూర్చుకుంది. ఇవి గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత గైడెన్స్‌తో లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదిస్తాయి. 10 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలపై ఇవి దాడులు చేయగలవు. గరిష్ఠంగా 2.5 కిలోమీటర్ల ఎత్తు వరకు ఎగురుతూ శత్రువుల కంట పడకుండా చొచ్చుకెళతాయి. ప్రతి డ్రోన్ సుమారు 2.5 కిలోల వరకు పేలుడు పదార్థాలను మోసుకెళ్లి, లక్ష్యాన్ని తాకిన వెంటనే పేలిపోతుంది. అందుకే వీటిని ఆత్మాహుతి డ్రోన్లు అంటారు. జీపీఎస్ సిగ్నల్స్ లేని ప్రాంతాల్లో కూడా ఇవి పనిచేస్తాయి. మైనస్ 35 డిగ్రీల గడ్డకట్టే చలిలో కూడా ఇవి సమర్థవంతంగా దాడులు చేయగలవు. సాధారణ సైనికులు వెళ్లలేని కఠినమైన కొండ ప్రాంతాలు, అడవుల్లోకి చొచ్చుకెళ్లి శత్రువుల స్థావరాలను ధ్వంసం చేయడంలో ఇవి దిట్ట. భారత సరిహద్దుల రక్షణలో ఈ డ్రోన్లు ఒక 'గేమ్ చేంజర్'గా మారుతాయని రక్షణ రంగ నిపుణులు భావిస్తున్నారు. ఉగ్రవాద మూకలను ఏరిపారేయడానికి ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

# డాష్ కామెంట్‌కు రాష్ కామెంట్ చేయబోను

హైదరాబాద్, ఏప్రిల్ 07 (భారత శక్తి) : తెలంగాణ, కేరళ రాష్ట్రాల మధ్య అభివృద్ధిపై మొదలైన మాటల యుద్ధం మరింత ముదిరింది. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఘాటైన పదజాలంతో, స్పష్టమైన గణాంకాలతో బదులిస్తూ ఒక బహిరంగ లేఖ రాశారు. తాను గౌరవప్రదంగా విమర్శలు చేసినప్పటికీ, విజయన్ మాత్రం అమర్యాదకరమైన భాషను ఉపయోగించారని రేవంత్ ఆక్షేపించారు. "మీ డాష్ కామెంట్‌కు నేను రాష్ కామెంట్ చేయబోను" అంటూ చురక అంటించిన ఆయన, మీరు మా రాష్ట్రానికి వచ్చినప్పుడు అతిథికి ఇవ్వాల్సిన పూర్తి గౌరవం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు, ఇదే నా చివరి స్పందన అంటూ రేవంత్ రెడ్డి తన లేఖను ఎక్స్ లో పంచుకున్నారు.

**పాత లెక్కలు కాదు... కొత్తవి చూడండి**

తెలంగాణ ప్రస్తుత పనితీరుపై తీర్పు ఇవ్వడానికి పినరయి విజయన్ 202324 నాటి నీతి ఆయోగ్ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సూచీని ఉటంకించడంపై రేవంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సూచీ పదేళ్ల బీఆర్ఎస్‌బీజేపీ పాలన చివరి రోజులను ప్రతిబింబిస్తుందని, 28 నెలల క్రితం 2023 డిసెంబరులో ఆ పాలన ముగిసిందని గుర్తుచేశారు. తమ ప్రభుత్వ పనితీరును కొత్త గణాంకాలతో అంచనా వేయాలని ఆయన సవాలు విసిరారు. "202425 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 16.12 లక్షల కోట్లకు చేరింది. జాతీయ సగటు 9.9 శాతం ఉండగా, తెలంగాణ వృద్ధి రేటు 10.1 శాతంగా నమోదైంది. ఆర్బీఐ స్టాటిస్టిక్స్ 202425 నివేదిక ప్రకారం, రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 3.87 లక్షలకు పెరిగింది. ఈ విషయంలో కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, చివరకు కేరళను కూడా అధిగమించి దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది" అని రేవంత్ రెడ్డి తన లేఖలో స్పష్టంగా వివరించారు. కేరళ సాధించిన విజయాలు కొన్ని దశాబ్దాల కృషి ఫలితమని అంగీకరిస్తూనే, ప్రత్యేకంగా విజయన్ హయాంలో ఏం జరిగిందో అక్కడి ప్రజలకు వివరించాలని హితవు పలికారు.

*** పేదరిక నిర్మూలన, అవినీతిపై సూటి ప్రశ్నలు**

2025 చివరి నాటికి కేరళ తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా అవతరిస్తుందని విజయన్ చేసిన ప్రకటనను రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. "ఇప్పుడు ఏప్రిల్ 2026 నడుస్తోంది. ఇంకా 64,006 కుటుంబాలకు మైక్రోప్లాన్‌లు అందుతున్నాయని మీరే లేఖలో చెబుతున్నారు. మరి తీవ్ర పేదరికం నిజంగా నిర్మూలించబడిందా? నవంబర్ 1, 2025 నాటి మీ ప్రకటనను ఏదైనా స్వతంత్ర సంస్థ ధృవీకరించిందా?" అని నిలదీశారు. నీతి ఆయోగ్ అవినీతి ర్యాంకింగ్స్‌ను తాను గౌరవిస్తానని, కానీ కేరళ నిజంగానే అవినీతి రహిత రాష్ట్రమైతే ముఖ్యమంత్రి కార్యాలయంతో సంబంధాలున్నాయని ఆరోపణలు ఎదుర్కొంటున్న గోల్డ్ స్మగ్లింగ్ కేసు ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. అలాగే, శబరిమల అయ్యప్ప ఆలయం నుంచి మాయమైనట్లు ఆరోపణలున్న 4.5 కిలోల బంగారం లెక్క తేలలేదని గుర్తుచేశారు.

*** మాది 'తెలంగాణ రైజింగ్' విజన్**

తమ ప్రభుత్వ దార్శనికతను వివరిస్తూ.. 'తెలంగాణ రైజింగ్' తమ లక్ష్యమని రేవంత్ పేర్కొన్నారు. దశాబ్దంలో రాష్ట్రాన్ని ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే ధ్యేయమన్నారు. హైదరాబాద్ సమీపంలో 'ఫ్యూచర్ సిటీ', జహీరాబాద్‌లో 'నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్' ఈ లక్ష్య సాధనకు మూలస్తంభాలుగా నిలుస్తాయని తెలిపారు. కేరళలో రాబోయే కొత్త ప్రభుత్వం 'నవ కేరళం' విజన్‌ను అమలు చేస్తుందని తాను విశ్వసిస్తున్నానని, త్వరలోనే అక్కడి ప్రజలు సరైన నిర్ణయం తీసుకుంటారంటూ విజయన్‌కు చురకలు అంటించారు.

# ఏపీ అగ్నిమాపక శాఖకు
# హైటెక్ హంగులు

అమరావతి, ఏప్రిల్ 07 (భారత శక్తి) : ఆంధ్రప్రదేశ్ అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖ బలోపేతం దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. శాఖ ఆధునికీకరణలో భాగంగా మొత్తం రూ.252.93 కోట్లతో చేపట్టిన ప్రణాళికలో తొలి దశగా, రూ.33.25 కోట్ల విలువైన నూతన వాహనాలు, అత్యాధునిక పరికరాలను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ప్రారంభించారు. అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన జెండా ఊపి కొత్త వాహనాలను సేవలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా అధికారులు కొనుగోలు చేసిన పరికరాలు, వాహనాల పనితీరును ముఖ్యమంత్రికి వివరించారు. తొలి విడతలో భాగంగా రూ.18 కోట్ల వ్యయంతో 25 అధునాతన అగ్నిమాపక శకటాలు, రూ.10 కోట్లతో హై ప్రెషర్ పంపులు కలిగిన 40 క్విక్ రెస్పాన్స్ వాహనాలు, రూ.2.49 కోట్లతో 50 అత్యవసర రబ్బర్ బోట్లు, రూ.2.08 కోట్లతో 30 బీఏ సెట్ కంప్రెసర్లను ప్రభుత్వం సమకూర్చింది. కేంద్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా వినియోగించుకుని ఈ పరికరాలను అందుబాటులోకి తెచ్చిన అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, ప్రజల ప్రాణాలను కాపాడటానికి ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. రాజధానితో పాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఎత్తైన భవనాల (హైరైజ్ బిల్డింగ్‌లు) నిర్మాణం పెరుగుతున్నందున, వాటికి అనుగుణంగా అగ్నిమాపక శాఖ ఆధునిక పరికరాలను సమకూర్చుకోవాలని సూచించారు. గతంలో అగ్నిమాపక విభాగంలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేదని, మళ్లీ అదే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విపత్తుల సమయంలో పొరుగు రాష్ట్రాలకు సైతం సహాయం చేసిన ఘనమైన చరిత్ర మనకు ఉందని గుర్తుచేశారు. అన్ని సవాళ్లను అధిగమించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమర్థంగా సద్వినియోగం చేసుకుని అగ్నిమాపక శాఖను మరింత బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్, అగ్నిమాపక శాఖ డీజీ పీవీ రమణ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, పలువురు

# "బీఆర్ఎస్ 200 యూట్యూబ్ ఛానళ్లను కొనుగోలు చేసింది

హైదరాబాద్, ఏప్రిల్ 07 (భారత శక్తి) : అక్రమంగా గడించిన వేల కోట్ల రూపాయలతో బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 200 యూట్యూబ్ ఛానెళ్లను కొనుగోలు చేసి, ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు మండిపడ్డారు. సోషల్ మీడియా, యూట్యూబ్ వేదికగా బీఆర్ఎస్ బురదజల్లుతోందని, వీటిని కాంగ్రెస్ కార్యకర్తలు దీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. కేవలం ఇంట్లో కూర్చుంటే అధికారం రాదని, 'మంత్రాలకు చింతకాయలు రాలవు' అనే నిజాన్ని గుర్తించి ఫీల్డ్‌లోకి వెళ్లి పని చేయాలని సూచించారు. 2029లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు, రాష్ట్రంలో పార్టీని నిలబెట్టేందుకు ప్రతి కార్యకర్త రోజుకు ఒక గంట సమయం కేటాయించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

# అరెస్టులు మాకు కొత్త కాదు: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 07 (భారత శక్తి) : పరిగి భూ సేకరణ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టులు, గృహనిర్బంధాలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఆయన 'పిరికిపంద చర్యలు'గా అభివర్ణించారు. పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతు తెలపడం నేరమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ వంటి నేతలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. "అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను ఎదుర్కొన్నాం. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాం" అని స్పష్టం చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల అనుమతి లేకుండా సాగిస్తున్న బలవంతపు భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# దేశం కోసం నేను, నా ప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు



టెహ్రాన్, ఏప్రిల్ 7 : ఇరాన్ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. దేశానికి చెందిన 14 మిలియన్లకు పైగా ఇరాన్ ప్రజలతో పాటు తానూ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాల్పుల విరమణకు పలు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదని అన్నారు. ఇరాన్ కోసమే నిలబడ్డాను, ఇక ముందు కూడా నిలబడతానని పేర్కొన్నారు. ఇరాన్ హర్మూజ్ జలసంధిని తెరవకపోతే ఆ దేశంలోని అనేక స్థావరాలను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈసారి డెడ్‌లైన్ పొడిగింపు ఉండదని, ఇరాన్‌ను తమ బలగాలు ఒక్క రాత్రికే తుడిచి పెట్టేయగలవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు ధీటుగా స్పందించారు. అమెరికా తాత్కాలిక ఒప్పందాలకు అంగీకరించబోమని, తమ శాశ్వత డిమాండ్లు అంగీకరించాలని చెబుతోంది. తాను, తమ దేశ ప్రజలు ప్రాణత్యాగాలకు కూడా సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం చూస్తుంటే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 07 (భారత శక్తి) : తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురవబోతున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఓవైపు మండుతున్న ఎండలు, మరోవైపు వర్షాలతో తెలుగు రాష్ట్రాల్లో విచిత్రమైన పరిస్థితి నెలకొననుంది.

**ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి:**

దక్షిణ కోస్తాంధ్ర, బంగాళాఖాతంపై ఏర్పడిన ఉపరితల ఆవర్తనం, రాయలసీమ మీదుగా విస్తరించిన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో భిన్నమైన వాతావరణం నెలకొంది. రెడ్ అలర్ట్ జిల్లాల జాబితా: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా. ఈ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉంది. భారీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయి.

వడగాల్పులు: నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా మనుబోలు, చిల్లకూరు, గూడూరు మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉంది.

**తెలంగాణలో పరిస్థితి:**

భారీ వర్షాలు కురిసే జిల్లాలు: భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, ఖమ్మం. మోస్తరు వర్షాలు: సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల కింద గానీ, బహిరంగ ప్రదేశాల్లో గానీ ఉండకూడదని అధికారులు హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులను గమనించి అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని సూచించారు. కోతకు వచ్చిన పంటలు, ఆరబోసిన ధాన్యం తడవకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

# టర్కీలో ఇజ్రాయెల్ కాన్సులేట్ వద్ద కాల్పుల కలకలం... ముగ్గురు సాయుధుల హతం

ఇస్తాంబుల్, ఏప్రిల్ 7 : టర్కీలోని ఇస్తాంబుల్‌లో మంగళవారం తీవ్ర కలకలం రేగింది. మూసివున్న ఇజ్రాయెల్ కాన్సులేట్ భవనం వెలుపల పోలీసులకు, దుండగులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు దాడి చేసిన వ్యక్తులు హతమయ్యారు. ఈ ఘటనలో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. బెసిక్తాస్ జిల్లాలోని కాన్సులేట్ భవనం వద్ద ఈ కాల్పులు చోటుచేసుకున్నట్లు స్థానిక మీడియా తెలిపింది. టర్కీ అంతర్గత వ్యవహారాల మంత్రి ముస్తఫా సిఫ్సీ ఈ ఘటనపై స్పందిస్తూ.. పోలీసులతో సాయుధ పోరాటానికి దిగిన ముగ్గురు వ్యక్తులను మట్టుబెట్టినట్లు ధృవీకరించారు. హతమైన ఉగ్రవాదుల వివరాలను గుర్తించినట్లు వెల్లడించారు. వారు ఇజ్మిత్ నుంచి అద్దె వాహనంలో ఇస్తాంబుల్ వచ్చినట్లు తెలిపారు.

# ఖానామెట్‌లో హైడ్రా భారీ ఆపరేషన్: ₹1200 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం

హైదరాబాద్: ఏప్రిల్ 7 (భారతశక్తి): ఐటీ కారిడార్ పరిధిలోని ఖానామెట్‌లో ఆక్రమణలకు గురైన విలువైన ప్రభుత్వ భూములను హైడ్రా (HYDRAA) స్వాధీనం చేసుకుంది. మంగళవారం నిర్వహించిన ఈ భారీ ఆపరేషన్‌లో సుమారు 8 ఎకరాలకు పైగా భూమిని స్వాధీనం చేసుకుని, దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. స్వాధీనం చేసుకున్న భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు ₹1200 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**బడా సంస్థల కబ్జాలో అసైన్డ్ భూములు**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని సర్వే నంబరు 55లో ఉన్న భూమిని గతంలోనే జిల్లా కలెక్టర్ 'ప్రోహిబిటెడ్' (నిషేధిత) జాబితాలో చేర్చారు. అయినప్పటికీ, మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ ఈ భూమి తమదేనని వాదిస్తూ వస్తోంది. ఇందులో వాసవి నిర్మాణ సంస్థ తన భవన నిర్మాణ కార్మికుల కోసం తాత్కాలిక షెడ్లు, ఆర్‌సీసీ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి, నిర్మాణ సామగ్రిని భద్రపరిచింది. ఇలా సుమారు 4.20 ఎకరాల భూమి ఈ సంస్థల ఆధీనంలో ఉంది. మరోవైపు, ఇదే సర్వే నంబరులోని మరో 4 ఎకరాల భూమిని కొలను సబిత అనే వ్యక్తి తనదిగా చెప్పుకుంటూ బౌన్సర్ల ద్వారా కాపలా ఏర్పాటు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. రెవెన్యూ అధికారులతో కలిసి రికార్డులను పరిశీలించిన అనంతరం, అది ప్రభుత్వ భూమిగా ధ్రువీకరించుకున్నారు. మంగళవారం ఉదయం సిబ్బందితో కలిసి వెళ్లిన అధికారులు ఆక్రమణలను తొలగించారు. స్వచ్ఛందంగా తొలగింపు: అధికారుల హెచ్చరికలతో వాసవి సంస్థ తన ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించుకుంది.






కూల్చివేతలు: కార్మికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను అధికారులు కూల్చివేశారు. రక్షణ చర్యలు: 8 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు, "ఇది ప్రభుత్వ భూమి అతిక్రమించిన వారు శిక్షార్హులు" అని పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేశారు. గతంలోనూ ఇదే ప్రాంతంలోని సర్వే నంబరు 53లోని మొండికుంటతో పాటు సర్వే నంబరు 55లో 11 ఎకరాల భూమిని హైడ్రా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజా ఆపరేషన్‌తో ఐటీ కారిడార్‌లోని కబ్జాదారుల్లో గుబులు మొదలైంది.



# బీరంగూడ అభివృద్ధి కీ కృషి చేద్దాం

* **బీరంగూడ అధ్యక్షులు అదెల్లి రవీందర్**

అమీన్‌పూర్ ఏప్రిల్ 7 (భారత శక్తి) : బీరంగూడ డివిజన్ లో పేరుకు పోయిన అనేక సమస్యలు అధికారుల దృష్టికి చెచ్చి పరిష్కారామ్ చేసుకోవాలని బీరంగూడ గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవాలని గ్రామస్తుల సహకారంతో ముందుకు వెళదామని బీరంగూడ అధ్యక్షులు అదెల్లి రవీందర్ పేర్కొన్నారు. బీరంగూడ కమిటీ అధ్యక్షులు అదెల్లి రవీందర్ అధ్యక్షతన కమిటీ సమావేశం బీరంగూడ కమ్యూనిటీ హాల్ లో జరిగింది. ఈ సమావేశంలో బీరంగూడ బీరంగూడ అభివృద్ధి కీ సంబంధించి త్వరలో అధికారులను ప్రజాప్రతినిధులును కలవాలని నిర్ణయం చేశారు. సమావేశం లో గ్రామ అధ్యక్షులు అదెల్లి రవీందర్ పెద్దలు మాజీ కౌన్సిలర్ ఎడ్ల రమేష్ ప్రకాష్ రెడ్డి ఉపాధక్షులు సత్యనారాయణ కిష్టయ్య ప్రధాన కార్యదర్శి వీరేశం కార్యదర్శి బంటు రమేష్ దండు జ్ఞానేశ్వర్ కోశాధికారి బంటు శివ మరియు మాకం మల్లేష్ బంటు ప్రవీణ్ ఎడ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.



# పటాన్‌చెరు నియోజకవర్గంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన కాట శ్రీనివాస్ గౌడ్

పటాన్‌చెరు, ఏప్రిల్ 7 (భారత శక్తి) : పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) చెక్కులను పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ తన నివాసంలో స్వయంగా అందజేశారు. మొత్తం 18 మంది లబ్ధిదారులకు రూ. 7,29,000 మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమం స్థానిక నాయకులు మరియు ప్రజల సమక్షంలో జరిగింది. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అవసరమైన కుటుంబాలకు, ముఖ్యంగా వైద్య అత్యవసర పరిస్థితుల్లో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం చేరేలా కృషి చేస్తామని, ప్రజల సంక్షేమం తమకు ముఖ్యమని ఆయన హామీ ఇచ్చారు. లబ్ధిదారులు తమకు అందిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

# మత్స్య సంపద యోజన పథకం కింద లాటరీ విధానం ద్వారా లబ్ధిదారుల ఎంపిక



కామారెడ్డి (భారత శక్తి ప్రతినిధి) ఏప్రిల్ 07: ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద కామారెడ్డి జిల్లాకు జనరల్ కేటగిరీ కింద (08), ఎస్సీ కేటగిరీ కింద (02), ఎస్టీ కేటగిరీ కింద (01) మహిళా కేటగిరీ కింద (02) మొత్తం 13 వాహనాలను మంజూరు చేయడం జరిగినది. ఈ వాహనాల మంజూరుకు గాను జనరల్ కేటగిరీ కింద (109), ఎస్సీ కేటగిరీ కింద (02), ఎస్టీ కేటగిరీ కింద (01) మరియు మహిళా కేటగిరీ కింద (01) మొత్తం 113 దరఖాస్తులను స్వీకరించడం జరిగినది. జనరల్ కేటగిరీలో 08 వాహనాలకు 109 దరఖాస్తులు అందిన నేపథ్యంలో, జిల్లా కలెక్టర్, ఆశిష్ సాంగ్వాన్ ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గానికి 02 వాహనాల చొప్పున మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగింది.

ఈ కార్యక్రమం జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) మధు మోహన్ సమక్షంలో, జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, మత్స్యశాఖ అధికారులు దరఖాస్తుదారుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించబడింది. లాటరీ ద్వారా ఎంపికైన 08 మంది లబ్ధిదారులకు డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) సమర్పించుటకు ఒక వారం గడువు ఇవ్వబడింది.

# పీహెచ్.డీ. ప్రోగ్రామ్ లలో ప్రవేశాల కోసం దరఖాస్తులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 7 (భారత శక్తి) : గీతంలో పీహెచ్.డీ. ప్రవేశాలు ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, మేనేజ్ మెంట్, ఫార్మసీ, హ్యూమానిటీస్, లాలో ఫుల్‌టైమ్ కోర్సులు పరిశ్రమ నిపుణులు, శాస్త్రవేత్తల కోసం ఎక్స్ ట్రామ్యూరల్ పీహెచ్.డీ. ప్రోగ్రామ్. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాదు, బెంగళూరు, విశాఖపట్నంలో నెలకొని ఉన్న మూడు ప్రాంగణా లలో 202627 విద్యా సంవత్సరానికి గాను పీహెచ్.డీ. ప్రోగ్రామ్ లలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ ప్రొఫెసర్ రామగోపాల్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆర్కిటెక్చర్, ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్ మెంట్, ఫార్మసీ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, న్యాయశాస్త్రం (లా) వంటి విభిన్న విభాగాలలో ఫుల్‌టైమ్ అభ్యర్థులకు ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. పరిశ్రమ నిపుణులు, శాస్త్రవేత్తల కోసం రూపొందించిన ఎక్స్ ట్రామ్యూరల్ పీహెచ్.డీ. ప్రోగ్రామ్ - ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మసీ విభాగాలలో అందుబాటులో ఉందని ఆయన తెలియజేశారు. సంబంధిత మాస్టర్స్ డిగ్రీ (కనీసం 55 శాతం మార్కులు), కనీసం 75 శాతం మార్కులతో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ, లేదా ఎం.ఫిల్. అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేయడానికి అర్హులని ప్రొఫెసర్ రామగోపాల్ పేర్కొన్నారు. ఫలితాల కోసం ఎదురు చూస్తున్న చివరి ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గీతం రీసెర్చ్ అడ్మిషన్స్ టెస్ట్ (GReAT), దాని తరువాత జరిగే ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు. UGCNET, CSIRNET, GATE, GPAT, ICAR, or DBTJRF వంటి చెల్లుబాటయ్యే జాతీయ స్థాయి పరీక్ష స్కోర్లు ఉన్న అభ్యర్థులకు రాత పరీక్ష నుంచి మినహాయింపు ఉంటుందని, వారిని నేరుగా ఇంటర్వ్యూకు పిలుస్తామని ఆయన వివరించారు. ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మే 11, 2026 అని ప్రొఫెసర్ రామగోపాల్ స్పష్టీకరించారు. ప్రవేశ పరీక్షలు మే 23న (ఆన్ లైన్ లో), మే 30న (ప్రత్యక్షంగా) జరుగుతాయని, ప్రోగ్రామ్ ఆగస్టు 24, 2026న ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఫుల్‌టైమ్ పీహెచ్.డీ. పరిశోధకులకు మూడు సంవత్సరాల వరకు నెలకు రూ.33 వేల ఫెలోషిప్ తో పాటు, అధునాతన పరిశోధనా సౌకర్యాలు, సహకారాలు, అకడమిక్ మద్దతును గీతం అందిస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గీతం అధికారిక పోర్టల్ https://researchadmissions.gitam.edu లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సూచించారు. ఇతర వివరాల కోసం 08912866411 ను సంప్రదించాలని, లేదా phdsupport@gitam.edu కు ఈమెయిల్ చేయాలన్నారు.

# బడంగ్‌పేట్ బాట.. క్లీన్ అండ్ హెల్తీ!

* **రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు.. వ్యాపారులకు జరిమానా**
* **చెత్త కాల్చినా ఫైన్.. రంగంలోకి మున్సిపల్ యంత్రాంగం**
* **సఫాయి కార్మికులకు హెల్త్ చెకప్.. పన్నుల్లో 'క్యాష్‌లెస్' జోరు**







బడంగ్‌పేట్, ఏప్రిల్ 07 (భారత శక్తి) : బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ (సర్కిల్ 16) పరిధిలో పారిశుధ్య నిర్వహణపై అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. అటు కఠిన చర్యలు, ఇటు సంక్షేమ కార్యక్రమాలతో నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దే పనిలో పడ్డారు. మంగళవారం డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య నేతృత్వంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

**తనిఖీల్లో జరిమానాల మోత**

జిల్లెల్గూడ చౌరస్తాలో తనిఖీలు నిర్వహించిన అధికారులు పారిశుధ్య నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినంగా వ్యవహరించారు. రోడ్డు పక్కన చెరకు పిప్పిని (పల్ప్) నిర్లక్ష్యంగా పారవేసినందుకు ఓ దుకాణదారుడికి భారీగా జరిమానా విధించారు. రోడ్లపై వ్యర్థాలను వేస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే సిర్లా హిల్స్ ప్రాంతంలో బహిరంగంగా చెత్తను తగులబెడుతున్న వ్యక్తిని గుర్తించి ఫైన్ వేశారు. చెత్తను తగులబెడితే కాలుష్యం పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ వ్యర్థాలను SAT (స్వచ్ఛ ఆటో టిప్పర్) వాహనాలకే ఇవ్వాలని స్పష్టం చేశారు.




**పండ్ల వ్యాపారులకు అవగాహన**

చౌరస్తాలోని పండ్ల వ్యాపారులతో అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లపై చెత్త వేయకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాపార సముదాయాల్లో ఉత్పత్తయ్యే చెత్తను ప్రతిరోజూ మున్సిపల్ వాహనాలకే అప్పగించాలని ఆదేశించారు.

**సఫాయిల ఆరోగ్యంపై శ్రద్ధ**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సఫాయి కార్మికుల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంప్ నిర్వహించారు. నగరానికి సేవ చేస్తున్న కార్మికుల ఆరోగ్యమే మున్సిపాలిటీకి ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. వైద్యులు బాలామణి, ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కార్మికులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిత్యం దుమ్ము, కాలుష్యంతో పనిచేసే కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచించారు.

**నగదు రహితంగా పన్నుల చెల్లింపు**

మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నుల విషయంలో అధికారులు కీలక సూచనలు చేశారు. పారదర్శకత కోసం నగదు రహిత (Cashless) విధానాన్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. పన్ను చెల్లింపుదారులు చెక్కులు లేదా డీడీల ద్వారా తమ బకాయిలను చెల్లించాలని కోరారు.

**పాల్గొన్న అధికారులు:**

ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ కమిషనర్ వెల్దండి. సమ్మయ్యతో పాటు డీఈఈ అభినయ్ కుమార్, ఏఈ గంగా ప్రసాద్, వెటర్నరీ డాక్టర్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.